ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 23 సంచిక : 5,6 జనవరి & ఫిబ్రవరి 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 40

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## శ్రీ నాన్నగారి జీవిత విశేషాలు

సద్గురు శ్రీ నాన్నగారు 1934వ సంవత్సరం సెప్టెంబర్ 23వ తేదీన వారి అమ్మమ్మగారి ఊరు, పశ్చిమగోదావరి జిల్లాలోని కొమ్మర గ్రామంలో జన్మించారు. వారి వ్యవహారిక నామధేయం శ్రీ భూపతిరాజు వెంకట లక్ష్మీ నరసింహరాజుగారు (బి.వి.ఎల్.ఎన్. రాజుగారు). వారి తల్లిదండ్రులు శ్రీ సూర్యనారాయణ రాజుగారు, శ్రీమతి రాజయ్యమ్మగారు. వారి స్వగ్రామం జిన్నూరు. నాన్నగారి పూర్వీకులు వ్యవసాయదారులు. వారిది ఔదార్యము, మానవత్వము, భక్తి కలిగినటువంటి గౌరవనీయమైన కుటుంబం. శ్రీ నాన్నగారు బాల్యంలోనే తండ్రిని కోల్పోయారు. భక్తురాలైన వారి అమ్మమ్మ సీతాయమ్మగారు వారిని పెంచారు. వారి ప్రభావం శ్రీ నాన్నగారిపైన ఉండేది.

శ్రీ నాన్నగారి 20వ సంవత్సరంలో వారి అమ్మమ్మగారితో కలసి ఉత్తర భారతదేశంలో తీర్థయాత్రలకు వెళ్ళి ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శించారు. అప్పుడు ఆయన ఋషికేష్‌లోని స్వామి శివానందని కలిసారు. ఆయన నాన్నగారిని "బి గుడ్ డూ గుడ్" అని ఆశీర్వదించారు. దానిని నాన్నగారు జీవితాంతం ఆచరించి ఆ మాటలలో లోతులని తనదైన శైలిలో వివరించారు. డూ గుడ్ తేలికే కానీ బి గుడ్ చాలా కష్టం అనేవారు. మంచి పనులు చెయ్యటం తేలిక కానీ మంచిగా ఉండటం చాలా కష్టం. దానికి ఎంతో సాధన అవసరం అని చెప్పేవారు. పిన్న వయస్సు నుంచి ఆధ్యాత్మికత పట్ల ఆకర్షితులైన నాన్నగారు ఎన్నో ఆధ్యాత్మిక గ్రంధాలను చదివి వాటిని ఆచరిస్తూ ఉండేవారు.

ఆయన 22వ సంవత్సరంలో జరిగిన ఒక అపూర్వ సంఘటన ద్వారా భగవాన్ శ్రీ రమణమహర్షి ఆయన జీవితంలో ప్రవేశించారు.

ఆ సంఘటన ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చివేసింది. ఆ సంఘటనని శ్రీనాన్నగారు ఒక సందర్భంలో ఇలా వివరించారు -

"అది 1957వ సంవత్సరం. ఒక రోజు రాత్రి నాకు ఒక స్వప్నము వచ్చింది. ఆ స్వప్నములో చేతిలో కర్ర ఉన్న ఒక వృద్ధ వ్యక్తి వచ్చి నన్ను మంచం మీద నుంచి లేవదీసి, నన్ను మూడుసార్లు కుడి బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నారు. నా జోలికి రావద్దని, నన్ను ముద్దుపెట్టుకోవద్దని, నన్ను విడిచిపెట్టమని ఆయనతో గట్టిగా పోరాడినాను. అయినా ఆ అపరిచిత వ్యక్తి నా మాట వినిపించుకోలేదు. ఆయన నా జీవితము మీద దాడి చేస్తున్నట్లు అనిపించినది. నాకెంతో భయము కూడా వేసినది. ఆయన ఒడిలో నుంచి జారిపోవటానికి నేను గట్టిగా ప్రయత్నము చేసినాను. నన్ను ఆయన బలవంతముగా ఎత్తుకొని, ఎంతో ఆప్యాయముగా మూడుసార్లు ముద్దు పెట్టుకొన్న సమయములో, నా తలక్రిందున్న తలగడ జారిపోయింది. తలగడను స్వయముగా ఆయన చేతితో తీసి జాగ్రత్తగా మంచము మీద సర్ది నాకు ఇసుమంతయు నొప్పి లేకుండా తిరిగి యధావిధిగా నన్ను మంచము మీద పడుకోబెట్టినారు. నావంక ఎంతో జాలిగా ఒకసారి చూసి 'ప్రస్తుతానికి సరిపోతుందిలే' అని చెప్పి నెమ్మదిగా వెళ్ళిపోయారు. ఇదంతా ఒక డాక్టరు రోగికి ఆపరేషను చేసినట్లుగా అనిపించినది.

నాకు స్వప్నములో దర్శనమిచ్చి, నన్ను లాలించి, ఆశీర్వదించిన వ్యక్తి ఎవరో అర్థము కాలేదు. నాకు స్వప్నములో దర్శనమిచ్చిన వ్యక్తి ఎవరో తెలుసుకొనుటకు ఆరు మాసాలు తపిస్తూనే ఉన్నాను. ఒక రోజున మా జిన్నూరు లైబ్రరీలో కూర్చుని "ది హిందూ" ఆంగ్ల దినపత్రిక చదువుచున్నాను - అందులో మద్రాసు బుక్ పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన 'గ్రేట్ మెన్ ఆఫ్ ఇండియా' చూచినాను. భారతదేశములో జన్మించిన పదిమంది మహాత్ముల గురించి ఆంగ్లభాషలో చిన్న పుస్తకములలో ప్రచురించినారు. వారు ప్రచురించిన పేర్లు వరుసగా చదువుచున్నాను. అందులో ఏడవ పేరు 'శ్రీ రమణ మహర్షి' అని చదివేసరికి నా శరీరము జలధరించినది. నన్ను ఎవరో కుదిపినట్లు అనిపించినది. ఆయన పేరు చదవగానే నన్ను ఆకర్షించటమే కాకుండా, శరీరం నుంచి హృదయగుహలోనికి ప్రవేశించుటకు ఆయన నాకు దారి చూపిస్తున్నారు అనిపించినది. ఈ వ్యక్తి ఎవరో నా మనస్సును పక్వము చేయుటకు వచ్చినట్లుగా స్ఫురించినది. బుద్ధివిశాలమైనట్లుగా అనిపించినది. వెంటనే మద్రాసు కంపెనీ వారికి వ్రాసి 'శ్రీ రమణమహర్షి' అను పుస్తకము పోస్టు ద్వారా తెప్పించినాను. ఆ పుస్తకములో ఆయన పటమును కూడా ముద్రించినారు. నాకు ఆరు మాసముల పూర్వము స్వప్నములో దర్శనమిచ్చి ఆశీర్వదించిన అవతార

పురుషుడు ఈ పటములో ఉన్న 'శ్రీ రమణమహర్షి'లవారు అని తెలిసినది.

నాకు స్వప్నములో దర్శనము ప్రసాదించిన దేవతా పురుషుడు తమిళనాడు రాష్ట్రములో 'అరుణాచలము' అను పుణ్యక్షేత్రమందు 'శ్రీ రమణాశ్రమము'లో జీవించి 'భగవాన్ శ్రీ రమణ మహర్షి'గా ప్రఖ్యాతి పొంది, ఆయన తన 70వ సంవత్సరములో అనగా 14-04-1951 తేదీన మహా నిర్వాణము చెందినారు. ఆయనకు వ్యక్తిగతమైన జీవితము లేదు. 'సత్యాత్మ' ప్రకాశమే ఆయన జీవితము. సమత్వము ఆయన ఊపిరి. ఆత్మ ఒక్కటే సమానమైనది. ఆయన దర్శనమాత్రము చేతనే ప్రపంచములో అనేకమంది జీవితములో కృతార్థులైనారు. భారతదేశపు ఆధ్యాత్మిక ఆకాశానికి ఆయన సూర్యుడు లాంటివారు. యావత్ మానవజాతికి ఒక వరముగా శ్రీ రమణ స్వామిని పరమేశ్వరుడు ప్రసాదించాడు. ఆయన జీవితమే ఆయన సందేశము. రమణస్వామి ఉపదేశములను దేశ కాలములు బంధించలేవు. ఆయన నామ స్మరణ పుణ్యప్రదమైనది. మహాత్ములకు మహాత్ముడు. ఆయన అవతారము మానవజాతికే గర్వకారణము. మానవజాతి తపఃఫలముగానే ఆయన అవతరించారు. ఆయన సందేశము జాతికి వెలుగు!

నేను 1959వ సంవత్సరము జనవరి నెలలో మొదటిసారిగా తిరువణ్ణామలైలోనున్న రమణాశ్రమము దర్శించినాను. ఆనాటి నుండి నేటి వరకు రమణ సందేశమును వ్యాప్తి చేయుటకు నా జీవితమునంతా అంకితము చేసినాను. నేను కావాలని ఆయనను నా జీవితములోనికి తెచ్చుకొనలేదు - ఆయనే నన్ను కావాలని తీసుకొని, జీవితములో నన్ను కృతార్థుడిని చేసినారు."

భగవాన్‌తో ఆయన అనుబంధం గురించి శ్రీ నాన్నగారు ఇలా అన్నారు - "భగవాన్ శరీరంలో ఉన్నా లేకపోయినా నాకేమీ భేదం లేదు. ఆయనతో కలిసి జీవించిన వారికంటే ఆయన హృదయానికి నేనే ఎక్కువ దగ్గరగా ఉన్నాననిపిస్తుంది"

1982వ సంవత్సరములో అరుణాచలంలోని శ్రీ రమణాశ్రమంలో ఉండగా భగవాన్ అనుగ్రహంతో వారు ఆత్మానుభూతి పొందారు. దానిని గురించి శ్రీ నాన్నగారు ఈవిధంగా చెప్పారు - "శ్రీ భగవాన్ నా ఆధ్యాత్మిక హృదయమునకు - సహస్రారమునకు మధ్యగల మార్గమును తెరిచారు. అమృతనాడి జాగృతమగుటను నేను అనుభూతి చెందినాను. అప్పటినుంచి ఆనందము అనుభవిస్తున్నాను. ఇది నూతన ప్రారంభము". ఆ క్షణం నుంచి ఆయన అనుభవిస్తున్న శాంతి, అనుగ్రహరూపంలో సహజంగా మానవాళికి ప్రవహించనారంభించింది. ఆయన ఆధ్యాత్మికశక్తి ప్రపంచము అంతా వ్యాపించినది. ఆయన సమక్షంలో ప్రతి ఒక్కరూ ఆనందమూ, శాంతీ అనుభవించారు.

శ్రీ నాన్నగారు తనకోసం ఆర్తితో తపించే భక్తులకి అందుబాటులోకి రావటంకోసం ఎంతో శ్రమకోర్చి దేశం నలుమూలలా ప్రయాణం చేసి ఆత్మజ్ఞానాన్ని ప్రజలకి అందించారు. ఇంగ్లండు, అరబ్బు దేశాలు కూడా వెళ్ళి అక్కడ భక్తులను అనుగ్రహించారు. నిరంతరము తమ ఇంటి ప్రాంగణములో భక్తులకి దర్శనం ఇస్తూ వారిని తమ అమృతవాక్కులతో పరవశింపచేసేవారు. నాన్నగారి మాటలకంటే ఆయన మౌనం ఎక్కువ శక్తివంతముగా ఉంటుంది. ఆయన కరుణాపూరిత చూపులకి, మౌనం ద్వారా వచ్చే అనుగ్రహానికి అంతఃకరణాన్ని శుద్ధి చేసి, సంస్కరించే శక్తి ఉంటుంది. ఆయన మాటల కోసం తపించే భక్తులు కూడా ఆయన మౌనంలో వచ్చే శాంతిని ఎక్కువ ఇష్టపడతారు. ఆ మౌనంలో భక్తుల దుఃఖం ఆరిపోయి, మనస్సు అంతర్ముఖమై పరమశాంతిని పొందుతారు.

జిన్నూరు గ్రామంలో రమణ కేంద్రం స్థాపించి సత్సంగములు జరిగే వీలు కలుగజేసి ఆ గ్రామాన్ని ఒక ఆధ్యాత్మిక కేంద్రముగా తీర్చిదిద్దారు. అరుణాచల క్షేత్రం, శ్రీ రమణాశ్రమం దర్శించే భక్తుల సౌకర్యం కోసం అరుణాచలంలో ఆంధ్రాశ్రమము మరియు శ్రీ నాన్నగారి ఆశ్రమము అనే పేరులతో రెండు ఆశ్రమాలను స్థాపించారు.

"భగవాన్ మార్గం ప్రచారం చెయ్యటం నా జీవితంలో ఒక భాగం మాత్రమే కాదు, అదే నా జీవితం" అంటారు శ్రీ నాన్నగారు. మొదటిలో వారి ప్రవచనాలు ఆడియో కేసెట్ల ద్వారా ప్రచారం పొందాయి. తరువాత రమణ భాస్కర అనే మాసపత్రిక స్థాపించి దాని ద్వారా ఆయన జ్ఞానామృతం మరింత వ్యాప్తి చెందేలా చేసారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆయన భక్తుల తపన, ఆధ్యాత్మిక సాధకుల జ్ఞానతృష్ణ తీర్చటానికి www.srinannagaru.com అనే వెబ్‌సైట్ ప్రారంభించి ఆయన ఉపదేశాలు ప్రపంచమంతటికీ అందుబాటులోకి తెచ్చారు. ప్రతిరోజు పదివేల ఓపెనింగ్స్‌తో ఆయన మెసేజ్ దేశదేశాలలో ప్రాచుర్యం పొందినది. దానితోపాటు www.srinannagarusatsang.com అనే ఇంకొక వెబ్‌సైట్ తోపాటు ఇతర వెబ్‌సైటుల ద్వారా కూడా ఆయన బోధ వ్యాపిస్తూనే ఉంది.

శ్రీ నాన్నగారు గొప్ప ఆధ్యాత్మిక గురువే కాదు, గొప్ప మానవతావాది కూడా! ఆధ్యాత్మిక బోధనలే కాకుండా, సామాజిక సేవలో కూడా శ్రీ నాన్నగారి కృషి చాలా ఉంది. పాఠశాలలలో మధ్యాహ్న భోజనము, అక్షరజ్యోతి కార్యక్రమములో రాత్రి పాఠశాలలు ఏర్పాటు చేసి విద్య అభివృద్ధికి ఆయన చేయూతనిచ్చారు. పేద విద్యార్థులకు, వృద్ధులకు, వృద్ధ ఆశ్రమాలకు, ఇంకా అవసరంలో ఉన్న ఇతర పేదలకు ఎందరికో ఆర్థిక సహాయం అందచేసేవారు.

సేవ కూడా ఏవిధంగా చెయ్యాలి, ఎలా చేస్తే ఆ పని ద్వారా తరించ వచ్చు ఆయన మాటలలోనే చూద్దాము - "నా పరిధిలో నేను కొంత సంఘసేవ చేసాను. అక్షరజ్యోతి

కార్యక్రమం వ్యాప్తిలో నా వంతు కృషి నేను చేసాను. పదిమందికి ఉపయోగపడే పనుల పట్ల శ్రద్ధ చూపించాను. ఏ పని చేసినా నిరాడంబరముగానే చేసాను. ఇతరుల మెప్పు ఆశించలేదు. సాధించవలసినది ఒక్కటే, తానెవరో తెలుసుకోవటమే. తానెవరో తెలుసుకోకుండా ఏదో సాధించానని ఎవరైనా అనుకుంటే - అది ఒకటి లేని సున్నలతో సమానము. దేశ కాలములకు పరిమితము కాకుండా ఉన్న సద్వస్తువులోనే సత్యమున్నది. అందులోనే సుఖము, శాంతి కలవు. శాంతి కలవాడు మాత్రమే స్వేచ్ఛను సాధిస్తాడు. బాహ్య వస్తువుల మీద కానీ, ఇతర వ్యక్తుల మీద కానీ, బాహ్య పరిస్థితుల మీద కానీ ఆధారపడకుండా స్వతంత్రమైన సుఖము ఎవడైతే పొందుతాడో వాడే జీవితములో కృతకృత్యుడు. భగవంతుడు మనకిచ్చిన శక్తులను ఇతరుల కోసం ఎవడైతే సద్వినియోగ పరుస్తున్నాడో వాడు జీవితములో ఎంతోకొంత సాధించినట్లుగా పరిగణించవచ్చు. ఉన్న శక్తులను సద్వినియోగం చేసేవాడు పవిత్రుడు అవుతాడు. పవిత్రత సత్యసాక్షాత్కారమునకు అర్హతను సంపాదించిపెడుతుంది. నేను కానీ, ఇతురులు కానీ అమృతానుభవమును పొందితేనే జీవితంలో సాధించగలిగినది సాధించామని భావించవచ్చు. జీవితం పొడుగునా ఎవరైతే సామరస్యం కోసం కృషి చేస్తారో, వారు అసత్యము నుండి, అజ్ఞానము నుండి విడుదల పొందుతారు. సాధించదగినది కూడా అంతే. జీవిత ప్రయాణంలో మన ఆలోచనలు, మన మాటలు, మన చేతలు మన ఉజ్జ్వల భవిష్యత్తుకి సహాయసహకారములు అందించేవిగా ఉండాలి. మన లక్ష్యం మంచిదైతే మన జీవితం కూడా దానికనుకూలంగా మళ్ళించబడుతుంది. అప్పుడు పొందవలసినదేదో పొందుతాము. సాధించవలసినది సాధిస్తాము".

## భక్తులతో శ్రీ నాన్నగారి అనుబంధం

శ్రీ నాన్నగారి అనుగ్రహం కోరి వచ్చే ప్రతిఒక్కరికీ వారి మనస్సులకు హత్తుకునేటట్టుగా ప్రేమపూరితమైన మాటలతో వివరంగా చెప్పటమే కాకుండా, మాటలకి అందని, మనస్సుతో ఊహించలేని అనుగ్రహం అందించేవారు. కరుణతో కూడిన వారి చూపు, వారి దయ, హృదయాంతరాలలోకి చొచ్చుకుపోయి, శాంతి తరంగాలను ప్రసరింపచేస్తాయి.

భక్తులతో శ్రీ నాన్నగారికి ఉన్న అనుబంధం ఆయన మాటలలో - "నేను శ్రోతలను అమితంగా ప్రేమిస్తాను. నేను వారి పట్లఉదారబుద్ధితో వ్యవహరిస్తాను. శాంతితో మెలుగుతాను. వారిలో సామాన్యమైన లోపాలను పట్టించుకోను. వారికి ఆత్మవిద్యను బోధించటంతో సరిపెట్టుకోకుండా, వారి భౌతికఅభివృద్ధిని కూడా కాంక్షిస్తాను. వారిలో ఉన్న మంచితనమును మేలుకొలుపుటకు సహకరిస్తాను. వారు శాంతి మార్గములో నడిచి శాంతి స్థానమును పొందుటకు నా వంతు కృషి నేను చేస్తాను. నాపట్ల భక్తులు విశ్వాసము

కూడా సజీవముగానే ఉంటున్నది. నేను భక్తులను నా మిత్రులుగానే చూస్తాను. కానీ వారు నన్ను దైవసమానంగా చూస్తారు. అందువలన వారిని గురించి ఆలోచించటంలోగానీ, వారికి బోధించటంలో కాని జాగ్రత్తపడతాను. ఏనాడు వారి పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించలేదు. నా అర్హతకు మించిన గౌరవాన్ని వారు నాపట్ల చూపిస్తున్నారని అనిపిస్తుంది. వారు ఏదైనా పొరపాటు చేస్తే అది నేను చేసినట్లుగానే భావిస్తాను. ఏదో ఒక స్థాయిలో వారి బాధలో నేను భాగం పంచుకుంటాను. ఆలోచనే కేంద్రంగా పెట్టుకొని జీవించుటకు నా బోధలు వారికి కొంతవరకు సహకరిస్తాయి. నాకు భక్తులకు ఉన్న సంబంధం గురు శిష్యుల సంబంధంలాంటిది కాదు. ఒకే కుటుంబసభ్యులవలే మెలుగుతాము. భక్తులు తమ జీవిత పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వారికి నాతోటి ఉన్న ప్రేమానుబంధము మాత్రము ఎన్నడూ తెగలేదు, మానసికమైన అనుబంధము ఉంటూనే ఉన్నది. దైనందిన జీవితములో వారి సమస్యలకు నేను చెప్పే మాటలలో సమాధానాలు దొరుకుతున్నాయి. ఆ మాటలు వినటం వల్ల వారికి శాంతి కలుగుతుంది. శాంతి లేని వాడికి సుఖం లేదు. నా ప్రవచనాల వల్ల వారికి సుఖం కలుగుతుంది. నా ద్వారా ప్రవహిస్తున్న ప్రేమ, కరుణ, ఆప్యాయత, ఆదరణ, అనురాగము వారికి శాంతి సాగరంలో ఈదుతున్నట్లుగా అనిపిస్తుంది. భక్తుల పట్ల నాకున్న అభిమానమును వారు కూడా గుర్తిస్తున్నట్లు నాకు అవగాహన అవుతున్నది. అందుచేత నేను కూడా బోధించకుండా ఉండలేక పోతున్నాను. క్లిష్టమైన విషయములను తేలికైన మాటలతో విశదపరచుటకు ప్రయత్నిస్తాను. నేను చెప్పిన విషయము వారికి అందకపోతే అది నా లోపముగానే పరిగణిస్తాను. భక్తులు నాపట్ల చూపిస్తున్న ఆదరణ, విశ్వాసము తెంపు లేకుండా ఉన్నది. అందువలన నా శరీరము మరణించినా నేను వారి హృదయాలలో జీవించే ఉంటాను. దుఃఖము లేని స్థాయికి వారిని తీసుకు వెళ్ళుటకు తత్త్వమును గురించి చిన్న చిన్న మాటలతో, పొట్టి పొట్టి వాక్యములతో వారికి ఉపదేశించుటకు ప్రయత్నిస్తున్నాను."

**శ్రీ నాన్నగారికి భక్తులతో అనుబంధాన్ని తెలిపే ఆయన మాటలు :**

- ✍ సోదర మహాశయులారా! నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మవైపు తిరగకపోతే, మీకు శాంతి కలగకపోతే లోపము నాది కానీ, మీది కాదు.
- ✍ మీ బుద్ధికి విషయము అందేటట్లు చెప్పలేకపోతే ఆ దోషము నాది కానీ, మీది కాదు.
- ✍ నా హృదయములో పవిత్రత ఉంటే మీరు మరచిపోవాలనుకున్నా నా మాటలు మిమ్మల్ని వెన్నంటి తరుముతాయి.
- ✍ నేను బోధ చేస్తున్నప్పుడు, నా హృదయములో శాంతి, పవిత్రత ఉంటేనే ఆ మాటలు

మీమీద పనిచేస్తాయి. నేను స్మరించినంత మాత్రముచేతనే మీ హృదయములో శాంతి కలుగకపోతే నాలో పవిత్రత లేనట్లే.

- నా మీద మీకు ప్రేమ లేనప్పుడు మీకు ప్రేమ కలిగేటట్లు చేయవలసిన బాధ్యత కూడా నాదే.
- మీరు చేసిన పాపము నేను చేసినట్లుగా భావించకపోతే నేను బోధించటానికి పనికిరాను. 'వాడు పాపి, వాడు పాపి' అని ఎదుటి వాడిని మీరు నిందించేబదులు మీకు చేతనైతే వాడిని సంస్కరించండి.
- ఆధ్యాత్మిక రంగంలో నేను మీకు చేసే సహాయముగాని, మీ అభివృద్ధి గాని మీ బుద్ధికి అందదు.
- మీరు ఏ నామరూపాలను ఆరాధించినా, నేను హృదయపూర్వకముగా మీ శ్రేయస్సునే కోరుచున్నాను. ఈ ఒక్క మంచి గుణానికే నాకు ఈశ్వరుడు జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాడు. మీరు కూడా మీ హృదయాన్ని శుద్ధి చేసుకోవటానికి ప్రయత్నించండి. 'హృదయ శుద్ధి కలవారు ధన్యులు - వారు దేవుని చూచెదరు. దేవుని కోసము విలపించువారు ఓదార్చబడుదురు' అన్నాడు ఏసు.
- నేను చెప్పిన మాటలని మీరు సక్రమముగా అర్థము చేసుకొంటే, అదే మీరు నన్ను గౌరవించినట్లు. అంతేగానీ మీ ధనాన్నిగానీ, దండలనుకానీ, దండాలను కానీ, నేను ఆశించుటలేదు.
- మీ శరీరానికి అన్నము ఎటువంటిదో, మీ మనస్సుకు నా మాటలు కూడా అటువంటివే! మీరు తిన్న అన్నము జీర్ణము చేసుకుంటే మీ ఒంటికి బలము - నేను చెప్పిన మాటలను మీరు అర్థం చేసుకుంటే అది మీ మనస్సుకు బలము.
- నా మాటల్ని మీరు అర్థం చేసుకుంటే నాకు లాభం కాదు, మీకే లాభం! మీ స్వరూపాన్ని మీరు తెలుసుకోవటానికి నా మాటలు మీకు సహకరిస్తాయి. కాబట్టి మీరు సుఖపడతారు. నన్ను మీరు తెలుసుకుంటే మీరు సుఖపడరు. మిమ్మల్ని మీరు తెలుసుకుంటే మీరు సుఖపడతారు.
- పాము కరుస్తుందని చెబితే, పామును చూడగానే మనకు ఆ మాటలు గుర్తుకు వస్తాయి. అదేవిధముగా నేను చెప్పే మాటల విలువ ఈ రోజున కాకపోయినా, ఏదో ఒక రోజున, ఏదో ఒక జన్మలో మీకు తప్పక గుర్తు వస్తాయి.
- రమణస్వామి దయ మీ మీద లేదని మీరు అనుకోవచ్చును కానీ ఆయన దయ గనుక మీ మీద లేకపోతే మీరు ఈ మాటలు వినలేరు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2017, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

సమీపంలో కూర్చోవటం అంటే ఏమిటి? సత్యానికి దగ్గరగా ఉండటం, సత్యానికి సమీపంగా చేరటం. ఇక్కడ సత్యం అంటే వ్యవహారిక సత్యం కాదు, పారమార్థిక సత్యం. భౌతికంగా గురువుకు సమీపంలో కూర్చుంటే అది నియర్ అనిపించుకోదు. భౌతికంగా మనం ఎక్కడ ఉన్నాము అనేది కాదు, మానసికంగా ఎక్కడ ఉన్నాము అనేది ముఖ్యం. శరీరాలు ఎక్కడ ఉన్నాయి అన్నదికాదు, మనస్సు ఎక్కడ ఉంది అనేది ప్రధానం. శరీరాలు దూరంగా ఉన్నా మనస్సు దగ్గరలో ఉండటం మంచిది. ఈ శరీరాలు అన్నీ కూడా మనస్సు క్రియేట్ చేసినవే. మన శరీరాలు అన్నీ కూడా నీడలు. మనం అద్దంలో చూసుకుంటే మన ప్రతిబింబం కనబడుతుంది. బింబం లేకుండా ప్రతిబింబం కనబడదు. మన హృదయంలో ఒక సత్యం ఉంది. అహంకారం అనండి, మనస్సు అనండి ఇదంతా కూడా ట్రూత్ యొక్క రిఫ్లెక్షన్. ఆల్ బాడీస్ ఆర్ షాడోస్. ఏదో కొంతకాలం అవి మనకు కనిపిస్తాయి, కొంతకాలం ఈ భూమి మీద తిరుగాడుతాయి. తరువాత కొంతకాలానికి అదృశ్యమవుతాయి. ఈ శరీరాలు అన్నీ కూడా నీడలే. నీకు మైండ్ ఉండటం వలన మేటర్ వస్తోంది, మైండ్ లేకపోతే మేటర్ రాదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి అంటే ఈ పంచభూతాలకు, ఈ జీవకోటికి, ప్రకృతికి ఏదైతే సపోర్టుగా ఉందో, మనకు ఏదైతే సపోర్టుగా ఉందో అదే మనం అయినప్పటికీ అదే మనం అని తెలియకుండా జీవిస్తున్నాము. అంటే ఏదైతే తెలుసుకోవాలో అది తెలుసుకోకుండా కాలాన్ని, శక్తిని వృథా చేసుకొంటున్నాము, చివరకు ఈ శరీరాలను విడిచిపెట్టేస్తున్నాము.

మీరు కలిసి జీవించటం అంటే భౌతికంగా సమీపంలో ఉండటం కాదు. భౌతికంగా మీరు సమీపంలో ఉన్నంత మాత్రంచేత మీరు ఐకమత్యంగా ఉన్నారని, కలిసి జీవిస్తున్నారని అర్థంకాదు. గురువు యందు మీకు విశ్వాసం ఉండాలి. గురువు మాటను పాటించే బుద్ధి మనకు కలగాలి. గురువు అంటే మన లోపల ఉన్న చీకటిని పోగొట్టేవాడే గురువు. గురువు నీకు మంచి విషయాలను, దైనందిన జీవితంలో ఉపయోగపడే విషయాలను చెప్పినప్పుడు వాటిని గాలికి వదిలేయకుండా వాటిని నీ హృదయంలోనికి తీసుకొని, వాటి ప్రకారం జీవించటమే గురువును గౌరవించటం. గురువు చెప్పినట్లు మహేంద్రనాథ్ గుప్తా జీవించేవాడు. గురువు హృదయంలో నుండి వచ్చిన నోబుల్ థాట్స్, నోబుల్ యాక్షన్స్, నోబుల్ వర్డ్స్‌ను వృథా చేయకుండా లోభివాడు తన ధనాన్ని ఎంత జాగ్రత్తగా పెట్టుకొంటాడో అలాగ గురువు చెప్పిన మంచి మాటలను అంత జాగ్రత్తగా హృదయ పూర్వకంగా స్వీకరించి

వాటిని ప్రాక్టీసు చెయ్యాలి. అప్పుడు మీరు గురువుకు సమీపంలో ఉన్నట్లు లెక్క. గురువు రూపాన్ని, గురువు నామాన్ని, గురువు టీచింగ్‌ను, గురువు లైఫ్‌ను నీ హృదయంలో కాపాడుకోవాలి. ఎందుచేత నంటే దేవుడికంటే కూడా గురువు ఎక్కువ. ఈశ్వరుడు నీకు ప్రారబ్ధం కొట్టే దెబ్బలు కొట్టేస్తాడు, ప్రారబ్ధం ద్వారా నీకు ఏమైనా మొట్టికాయలు తినవలసి ఉంటే ఆ మొట్టికాయలు పడిపోతాయి. మొట్టికాయలు నీకు పడ్డా దాని తాలూకా బాధ ఏమీ కొంచెం కూడా లేకుండా చేసి నీకు ధైర్యాన్ని యిచ్చి, జ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువు. నీ ప్రారబ్ధాన్నిబట్టి దేవుడు ఏమి చేస్తున్నా దాని తాలూకా ప్రభావం నీ బ్రెయిన్ మీద పడకుండా చేయగలిగినవాడు గురువు మాత్రమే. ఈశ్వరుడి కంటే గురువు ఎక్కువ, అది మీకు తెలియటం లేదు. ఎందుచేతనంటే ప్రారబ్ధం మిమ్మల్ని మొట్టికాయలు మొడుతుంది. ప్రారబ్ధం ఏ రోజున ఏమి తీసుకొనివస్తుందో చెప్పలేము. ఈ రోజు బాగానే ఉన్నాము కానీ రేపు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేము. రేపు ఎలా ఉన్నా, ప్రారబ్ధంలో ఏది తొంగి చూస్తున్నా, గాలివాన వచ్చినప్పుడు గాలి ఎంత స్పీడుగా ఉంటుందో నీ ప్రారబ్ధం యొక్క వేగం అంత స్పీడుగా ఉన్నప్పటికీ దానికి తట్టుకునే శక్తిని ప్రసాదించేవాడు గురువు. గురువు యొక్క విలువ మీకు తెలియటంలేదు. ఈశ్వరుడు వూరికే ఎడ్మినిస్ట్రేటర్ అంటే తల్లి గర్భంలో నుండి మీరు బయటకు వచ్చినది మొదలు మరల స్మశానంకు వెళ్ళేవరకు మీ దేహం ఎక్కడ ఉండాలి, ఏ పని చెయ్యాలి అని విధి ప్రకారం మీ దేహాన్ని నడుపుతాడు అంతే. వాడు ఈశ్వరుడు. కానీ గురువు అలా కాదు. డెస్టినీ ప్రకారం మీకు రావలసిన కష్టాలు, హింస వస్తున్నప్పటికీ దాని యొక్క ప్రభావం మీ మనస్సు మీద పడకుండా చేసి మిమ్మల్ని స్వీట్‌గా, హేపీగా ఉంచేవాడు గురువు. అవసరమైతే మీ ప్రారబ్ధాన్ని తీసుకొనేవాడు గురువు. నీ దగ్గర ఇంకేమైనా కష్టాలు అదనంగా ఉంటే పంపు మా భక్తుడు ఫేస్ చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు అని ఈశ్వరుడికే సవాల్ విసిరేవాడు గురువు. మీకు ఈశ్వరుడి విలువ తెలుస్తోంది కాని గురువు యొక్క విలువ మీకు తెలియటం లేదు. శిక్షించేవాడు ఈశ్వరుడు, రక్షించేవాడు గురువు. ఈశ్వరుడు రాజ్యాంగం ప్రకారం వెళ్ళిపోతాడు అంతే.

మీ శరీరాన్ని, మనస్సును సద్వినియోగం చేసుకోవటానికి అనుగ్రహించేవాడే గురువు. మట్టిముద్దలం అయిన మనల్ని బంగారపు ముద్దలుగా తయారుచేసేవాడు గురువే. ఇప్పుడు మీరు మేటర్‌తోటి, మైండ్‌తోటి ఎలాగైతే ఏకత్వం పొందుతున్నారో అలాగే లోపల ఉన్న సత్యంతోటి మీరు ఏకత్వం పొందాలి. మన పెద్దలు ట్రూత్‌ను ఎలా డిఫైన్ చేసారు అంటే సత్యం, శివం, సుందరం. సత్యం అంటే ట్రూత్, శివం అంటే నాలెడ్జ్, సుందరం అంటే బ్యూటీ అంటే ఫిజికల్ బ్యూటీ కాదు. ఫిజికల్ బ్యూటీకి ఏముంది? అది మామూలుగా

కాలప్రవాహంలో వయస్సుతో పాటు పోతుంది. మైండ్‌లో బ్యూటీ లేదు, మేటర్‌లో బ్యూటీ లేదు, ట్రూత్‌లోనే బ్యూటీ ఉంది. అందుచేతనే ట్రూత్ ఈజీ బ్యూటీ, బ్యూటీ ఈజ్ ట్రూత్ అని చెప్పారు. గురువు యొక్క హృదయం వేరు, ఆయన చెప్పిన వాక్యం వేరు కాదు. వాక్యము దేవుడై ఉన్నది. జనరల్‌గా మనిషి పాడైపోవటానికి కారణం ఏమిటి అంటే ఒకటి ఆలోచిస్తూ ఉంటాడు, ఇంకోటి మాట్లాడతాడు, వాడు చేసే పని వేరొక రకంగా ఉంటుంది. మూడూ ఏకంగా ఉండవు. ఆలోచించేది ఒకటి, మాట్లాడేది ఇంకొకటి, చేసేపని వేరొకటి అంటే వేరు వేరుగా ఉంటాయి. ఇవన్నీ తెలివితేటలు అని వాడు అనుకోవచ్చు. గురువు చెప్పిన వాక్యాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుచేతనంటే గురువు చెప్పిన వాక్యం కూడా దేవుడై ఉన్నది. అంటే వారి హృదయంలో ఉన్నదే వారు మాట్లాడతారు. హృదయంలో లేనిది వాళ్ళు మాట్లాడరు. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోవాలి. మనకు ఏది మంచిదో మనకంటే గురువుకు ఎక్కువ తెలుసు. అందుచేత ది గ్రేటెస్ట్ తింగ్ ఈజ్ టు స్టాప్ వర్రీ. ఇంక మనకు వర్రీ అక్కరలేదు. గురువు యొక్క వాక్యంతో పెనవేసుకుంటే దానితో మీకు తాదాత్మ్యం వస్తుంది.

దేహానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వవద్దు. మీకు శరీరాలు ఉన్నాయి, అలా ఉండ నివ్వండి. శరీరం నిలబడటానికి సరిపడ అన్నం తినండి, దానికి రోగం వస్తే మందులు వేసుకోండి అంతేగానీ ఈ శరీరమే నేను అని అనుకోవద్దు. మీకు నాలుగు ఎకరాలు పొలం ఉంది కాని ఆ పొలం మీరు కాదు. అలాగే మీకు ఒక శరీరం ఉన్నమాట నిజమే కాని ఆ శరీరం మీరు కాదు. ఎందుచేతనంటే శరీరం మరణించినప్పుడు మనం దానితో విడిపోతున్నాము కదా! మన బంధుత్వాలు, స్నేహాలు ఇవన్నీ శరీరాన్ని బట్టే కదా! మన శరీరంతోటే మనం విడిపోయేటప్పుడు ఇంక వాళ్ళతోటి మనకి సంబంధం ఏమిటి? ఇట్ ఈజ్ ఎటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ సారో, ఇట్ ఈజ్ ఎటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ సిన్, మిజరీ అండ్ డెత్. నీకు ఎటాచ్‌మెంట్ లేకపోతే అసలు సారో లేదు. మీకు అసలు ఎక్కడా ఎటాచ్‌మెంట్ లేకపోతే మైండ్ యొక్క వాండరింగ్ ఆగిపోతుంది. అరుణాచలేశ్వరుడితో భగవాన్ ఏమన్నారు అంటే నాకు బయట ఎక్కడా ఎటాచ్‌మెంట్ కనబడటంలేదు కానీ నీ మీద ఎటాచ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది. నీ మీద నాకు ఆకర్షణ పోలేదు. భగవాన్ దగ్గర భక్తులు ఎవరూ లేకపోతే ఇంక ఆయన గిరివంక అలా చూస్తూ ఉండేవారు. నీమీద ఇష్టం పోవటంలేదు. మరి ఇది కూడా దుఃఖాన్ని తీసుకొని వస్తుంది కదా! అందుచేత నీ మీద ఉన్న ఎటాచ్‌మెంట్‌ను ఎవరు పోగొడతారు, ఆ ఎటాచ్‌మెంట్‌ను నువ్వే పోగొట్టాలి అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్. నువ్వు నాకు కొంత సహాయం చేసినమాట నిజం.

ప్రపంచంలో ఎక్కడా ఎటాచ్‌మెంట్ లేకుండా చేసావు కాని నీ మీద ఉన్న ఎటాచ్‌మెంట్ నాకు పోవటం లేదు. నీ మీద ఉన్న ఎటాచ్‌మెంట్‌ను ఎవరు పోగొడతారు, నీకు సిఫార్సు చేసేవారు ఎవరు? అందుచేత నీమీద ఉన్న ఎటాచ్‌మెంట్‌ను నువ్వే పోగొట్టాలి అరుణాచలేశ్వరుడా!

మీరు ఏమి తింటున్నారు, ఏమి మాట్లాడుతున్నారు అని జాగ్రత్తగా చూసుకోండి. మీ శరీరాన్ని అలా ఉండనివ్వండి కాని దానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వవద్దు. బుద్ధుడు జ్ఞానానికి ఇచ్చిన ప్రాముఖ్యతలో వందోవంతు కూడా మేటర్‌కి ఇవ్వలేదు. మీ ఇంట్లో ముసలివారు అంటే పెద్దవయస్సు ఉన్నవారు ఉండవచ్చు. వారు శరీరంలో ఉండగా ఆ శరీరం ఎప్పుడు పోతుంది అని కనిపెట్టుకొని ఉండకూడదు. శరీరం పోయిన తరువాత కూడా వారు మన ఇంటిలోనే ఉన్నారు అనుకోవాలి. మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మీరు అభివృద్ధిలోనికి రావాలి అంటే మీ పూర్వీకుల దయ కూడా మీకు ఉండాలి. ఈశ్వరుడి దయ ఎలా ఉండాలో, దేవతల దయ ఎలా ఉండాలో అలాగే మీ పూర్వీకుల దయ కూడా మీకు ఉండాలి. వారిపట్ల మీరు గౌరవంగా ఉంటే వారి కంపేషన్ మీకు వస్తుంది. మన ముత్తాతలు, తాతలు ఉంటారు కదా! మనల్ని ఎవరు పెంచారు? మనకు ఎవరు అన్నం పెట్టారు? వారు మనల్ని పెంచారు కాబట్టి ఇంత వాళ్లమము అయ్యాము. వారు ఉన్నారు కాబట్టి మనం ఈ భూమి మీదకు వచ్చాము లేకపోతే రాలేము కదా! అందుచేత వారిపట్ల గౌరవం కలిగి ఉండాలి, కృతజ్ఞత కలిగి ఉండాలి. మదర్ అయామ్ యువర్ సన్ శంకర, నేను వచ్చేసాను అమ్మా అంటాడు ఆచార్యులవారు. నువ్వు మా అబ్బాయివి కాదు, ఎందుకు మాయ మాటలు చెపుతావు. నీ శరీరం మటుకు మాదే కానీ శంకరుడు మా వాడు కాదు అని తెలుస్తోంది. శరీరం మాదే కాబట్టి ఈ శరీరానికి నిప్పు పెట్టి వెళ్ళిపో అంది తల్లి. ఆవిడ ఏమీ లిబరేషన్ అడగలేదు. అయితే జ్ఞానికి శరీరం యిచ్చిన పేరెంట్స్ తరించాలి అది చట్టం. అందుచేత ఆర్యాంబకు లిబరేషన్ ఇచ్చాడు శంకరుడు. భగవాన్ కూడా తల్లికి లిబరేషన్ ఇచ్చారు. భగవాన్ 12వ సంవత్సరంలో ఆయన తండ్రి మరణించారు. అప్పుడు లిబరేషన్ ఇవ్వటానికి అవకాశం లేదు. ఆయన తండ్రే తరువాత మేజర్ చాడ్విక్‌గా వచ్చాక ఆయనకు లిబరేషన్ ఇచ్చారు. ఈ గొడవ అంతా ఎందుకు వచ్చింది అంటే నీ శరీరం మాదే కానీ శంకరుడు మావాడు కాదు అంటోంది తల్లి. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే ఎనిమిదవ సంవత్సరం వరకు ఇంటి దగ్గరే ఉన్నాను కదా! నేను గాలికి పెరిగానా? నువ్వు నాకు అన్నం పెట్టావు, చదువు చెప్పించావు కదా! నువ్వు పెంచకుండానే పెద్దవాడిని అయిపోయానా? నువ్వు చదువు చెప్పించకుండానే ఆచార్యుడిని అయిపోయానా? ఇప్పడు

నేను పెద్దవాడిని అయిపోయాను అనుకొని మంచం పట్టిన నిన్ను మరచిపోతే ఎలా ఉంటుంది అన్నారు. ఇప్పుడు మనకు ఎవరికైనా ఆ బుద్ధి ఉందా? నీ కొడుకును కాదంటున్నావు. అవునో కాదో మరి నన్ను పెంచావు కదా! నా గురించి నువ్వు ఎంతో కష్టపడ్డావు కదా! ఇప్పుడు మేము పెద్దవాళ్ళము అయిపోయాము అని, స్వతంత్రులం అయిపోయాము అని నిన్ను మర్చిపోతే ఎలాగ అని ఆర్ద్యాంబతో ఆచార్యులవారు అంటున్నారు.

నీ జీవితాన్ని నీ టీచర్‌కు అంకితం చెయ్యి. డెడికేట్ యువర్ లైఫ్ టు యువర్ టీచర్. టీచర్ ఏ వాక్యాలు అయితే చెప్పాడో వాటిని మీరు సొంతం చేసుకోవాలి, వాటి ప్రకారం మీరు జీవించాలి. రామకృష్ణుడికి మనకి తేడా ఏమిటి అంటే ఆయన ఏదైనా చదివాడు అనుకోండి వెంటనే ప్రాక్టీసు చేసేవాడు. ప్రాక్టీసు చేయకుండా ఎప్పుడూ విడిచి పెట్టలేదు. దేవుడు ఉన్నాడా అంటే ఉన్నాడు, చూసాము అంటే అది ప్రాక్టీసు చేసేవాడు. ప్రాక్టీసు చేస్తే ధ్యానబలంలో ఆయనకు దేవుడు దర్శనమిచ్చాడు. మట్టిని, రాయిని, బంగారాన్ని సమానంగా చూడమని భగవద్గీతలో చెప్పాడు. రామకృష్ణుడు మట్టిని, రాయిని, బంగారాన్ని గంగానది దగ్గరకు పట్టుకెళ్ళి, ఒడ్డున కూర్చుని ముందు మట్టిని పడేసేవాడు, తరువాత రాయిని పడేసేవాడు, తరువాత బంగారం పడేసేవాడు అంటే అవి మూడు పడేసేటప్పుడు మన మనస్సు సమానంగా ఉందా? లేకపోతే బంగారం పడేసేటప్పుడు ఏమైనా పెయిన్ వస్తోందా? అలా పెయిన్ వస్తూ ఉంటే మనకి బంగారం మీద ఎటాచ్‌మెంట్ ఉన్నట్లే. ఇదంతా లోపల చూసుకొనేవాడు. నువ్వు వింటే సరిపోదు, చూస్తే సరిపోదు, ప్రాక్టీసు చేయాలి. నీ జీవితమంతా గురువుకు సమర్పించాలి. నువ్వు గురువుపట్ల కృతజ్ఞత కలిగి వుండాలి. నీకు గురువుపట్ల ఫెయిత్ ఉండాలి, ట్రూ లవ్ ఉండాలి. శరీరాలు ఎక్కడ ఉన్నాయి అన్నది ముఖ్యం కాదు, నీ మనస్సు గురువు సమీపంలో ఉండాలి. గురువు సమీపంలో ఉంటే అది స్లోగా ప్యూరిఫై అవుతుంది. నువ్వు ఎక్కడ ఉన్నావు? ఏమి తింటున్నావు అని కాదు. నువ్వు అమెరికాలో ఉన్నా నీ తలంపును చూస్తూ ఉంటాడు. నీ తలంపులో ఏదైనా దోషం ఉంది అనుకో, దానిని సరి చేస్తాడు. నిన్ను పవిత్రం చేస్తాడు. గురువు అంటే ఆ శరీరం కాదు. గురువు యొక్క శరీరం పడిపోయిన తరువాత కూడా ఆయనతో మనకు అనుబంధం కంటిన్యూ అవుతుంది. ఎందుచేతనంటే గురువుకు శరీరం ఉన్నప్పుడు కూడా ఆయన ఆ శరీరం కాదు. ఏదైతే మనలను అనుగ్రహిస్తోందో అది మేటర్ కాదు, దానికి మరణం లేదు. మట్టిలా ఉన్న మనల్ని బంగారంలా మార్చేవాడే గురువు. పూర్ణస్థితిని పొందేవరకు ఆయన మనలను విడిచిపెట్టడు, వాడు గురువు.

ఇప్పుడు నీకు నేను తెలుస్తోంది. భగవంతుడి గొడవ వదిలేయండి, ఇప్పుడు మనం

చెప్పే నేనుకు దేహంతో అనుబంధం ఉంది, మనస్సుతో అనుబంధం ఉంది. లోపల యింద్రియాలతో అనుబంధం ఉంది. శరీరానికి చావు వస్తే నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు కదా. అలాకాదు. అది మనకు ఎలా ఎక్స్‌ప్రెస్ అవ్వాలి అని ఆచార్యులవారు చెపుతున్నారు అంటే మనకి నేను ఎక్స్‌ప్రెస్ అవుతూ ఉండాలి. అందులో మనస్సు కనబడకూడదు, యింద్రియాలు కనబడకూడదు, శరీరం కనబడకూడదు, అది బాడీలెస్, మైండ్‌లెస్, వరల్డ్‌లెస్, గాడ్‌లెస్, ఎవ్వరిథింగ్ లెస్. ఇండిపెండెంట్‌గా ఆ నేను మీకు ఎక్స్‌ప్రెస్ అవుతూ ఉండాలి. అది ప్రజ్ఞానం. ప్రజ్ఞానం కాదు అదే బ్రహ్మం. అది బ్రహ్మమే కాదు అది నీవై ఉన్నావు. అది నీకు తెలియబడిన వెంటనే అందులో ఐక్యమవుతావు. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే నీ బుద్ధి స్వచ్ఛంగా ఉండాలి. ఈ శరీరం, మనస్సు వలన కొన్ని లిమిటేషన్స్ వస్తాయి. నీ బుద్ధి బలంతోటి, విశ్వాసంతోటి ఈ మనస్సు, శరీరం కల్పించే హద్దులను దాటాలి. బ్రహ్మం నీ లోపలే ఉంది. అది తెలిసిన వెంటనే అదే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. అప్పుడు విరామం లేకుండా లోపల ఉన్న బ్రహ్మంతోటి ఏకత్వం అలా కంటిన్యూ అవుతుంది. ఇంక నీకు సెపరేషన్ ఉండదు. ఒకటిగా ఉన్నప్పుడు ఇంక సెపరేషన్ ఏముంటుంది? నువ్వు ఇతరులతోటి విడిపోగలవు కానీ నీతో నువ్వు ఎలా విడిపోతావు. మీరు ఏదైతే అయి ఉన్నారో దానితోటి ఎలా విడిపోతారు? ఇతరులతో మీకు సెపరేషన్ రావచ్చు కానీ మీతో మీకు సెపరేషన్ రాదు. నీ హృదయంలో ఉన్న నేను ఎప్పుడైతే నీకు వ్యక్తమైందో అదే జగత్తు అంతా వ్యాపించి ఉంది, అదీ ఇదీ వేరు కాదు, ఉన్నది ఒక్కటే అనే అనుభవం నీకు కలుగుతుంది. ఆచార్యుల వారు ఏమంటున్నారు అంటే దేహగతమైన నేను, మనోగతమైన నేను, ఇంద్రియగతమైన నేను ఎంతోకొంత కలవకుండా నీ యాక్షన్ ఉండదు. నేను అది చేసాను, నేను యిది చేసాను అంటున్నావు కదా! ఇది అంతా కర్తృత్వంలో నుండే వస్తోంది. అసలు నీకు కర్తృత్వం లేకపోతే ఇంక నీకు దుఃఖం లేదు.

ఆధ్యాత్మిక జీవితంలోనికి వచ్చాక పిరికితనం విడిచిపెట్టాలి. మీ హృదయంలో జ్ఞానం అనే ఇనుప పెట్టి ఉంది. దానిని ఓపెన్ చెయ్యాలి. మీరు పూజలు చేసినంతమాత్రంచేత, జపాలు చేసినంతమాత్రంచేత, యాత్రలకు వెళ్లినంతమాత్రంచేత ఆ పెట్టెను ఓపెన్ చెయ్యలేరు. కర్మకాండ చేసినా దానిని ఓపెన్ చెయ్యలేరు. సకామకర్మ నిష్కామంగా చెయ్యాలి, విచారణ చెయ్యాలి, సదాచారం విడిచిపెట్టకూడదు. లిబరేషన్ అనేది సహజంగా నీ హృదయంలోనే ఉంది. అది ఎక్కడో బయట నుండి వచ్చేది కాదు. పని మానివేస్తే లిబరేషన్ వస్తుంది అనుకోవద్దు. పనిచేసినా చేయని వాడితో సమానంగా ఉండాలి. కొంతమంది వాళ్ళు పనిచేస్తున్నట్లు తెరమీద కనిపిస్తూ ఉంటారు. అంటే వారు పనిచేస్తున్నట్లు ఇతరులకు

కనబడాలి. కొంతమంది పనిచేస్తూ ఉంటారు కానీ తెరమీద కనబడరు. ఎందుచేతనంటే వారికి పనే దేవుడు, ఆ పని చేసుకొని వెళ్ళిపోతారు. వారు ఆ పని చేసినట్లు మనకు తెలియాలి అని అనుకోరు ఎందుచేతనంటే వారికి అదర్‌నెస్ లేదు. నేను అనే బుద్ధిని ఓవర్‌కమ్ చేస్తే అదర్‌నెస్ పోతుంది. అదర్‌నెస్ పోతే మీకు అన్‌లిమిటెడ్ పీస్, అన్‌లిమిటెడ్ హేపీనెస్ అనుభవంలోనికి వస్తుంది. అప్పుడు నీకు అన్‌బ్రోకెన్ కాంటాక్ట్ విత్ ట్రూత్ వస్తుంది. ఇంక దానికి బ్రేక్ ఉండదు, అది అలా కంటిన్యూ అయిపోతుంది. ఎప్పుడైతే నీకు లిబరేషన్ వచ్చిందో అప్పుడు నీకు సుఖం తెలుస్తూ ఉంటుంది. అప్పుడు ఎవరైనా వచ్చి నిన్ను వైకుంఠానికి రమ్మంటారు అనుకో రాను అని చెపుతావు. ఇష్టం లేక కాదు, ఇంక నీకు అవసరం లేదు. సన్యాసం అనేది ఏదో మీకు ఇంటి దగ్గర యిబ్బందులు వచ్చి సన్యాసం తీసుకోకూడదు. ఏది సత్యం ఏది అసత్యం, ఏది నిత్యం ఏది అనిత్యం అనే వివేక జ్ఞానం ఉండాలి. అది లేకుండా మీరు సన్యాసం తీసుకోకూడదు.

ఎవడైతే కర్మ చేసినా చెయ్యనివాడితో సమానం అవుతాడో వాడు బుద్ధిమంతుడు, వాడు తెలివైనవాడు. వాడు కర్మచేసినా అకర్మ అయిపోతుంది. నేను కొంతమంది ఆఫీసర్లను చూసాను. వారు పనిచేస్తారు కానీ వారు చేస్తున్నట్లు పబ్లిక్‌కు తెలియాలి అని వారు అనుకోరు. కామ్‌గా పని చేసుకొని వెళ్ళిపోతారు. అలా ప్రశాంతంగా పని చేసిన వాడిని రాముడు అంటారు. శరీరం ఉండగా మరణంలేని స్థితి నీకు అనుభవంలోనికి వస్తే దానిని అమరత్వం అంటారు. చావటం, పుట్టటం దీనిని సంసారసముద్రం అంటారు. నీకు బుద్ధిబలం లేకుండా, ఆత్మవిశ్వాసం లేకుండా నువ్వు ఈ సంసార సముద్రాన్ని దాటలేవు. నీ గురించి నీకు కొంత అవగాహన ఉండాలి, నీ మీద నీకు విశ్వాసం ఉండాలి. రైట్ నాలెడ్జ్, రైట్ స్పీచ్, రైట్ యాక్షన్ వీటివలన నీకు విశ్వాసం కలుగుతుంది. అప్పుడు సంసార సముద్రాన్ని ఓవర్‌కమ్ చేయగలవు. పూర్వజన్మల్లో చేసిన కర్మ నిన్ను వెంటాడుతూ ఉంటుంది. ఇంద్రియాలకు సంబంధించినవి, మనస్సుకు సంబంధించినవి కూడా నీకు దుఃఖకారణాలు అవుతాయి. జ్ఞానం ఏమి చేస్తుంది అంటే అవి తీసుకొనివచ్చే వేగాన్ని తట్టుకునేలా చేస్తుంది. డెస్టినీ ఎంత వేగంగా ఉన్నా అది జ్ఞానిని ఏమీ చేయలేదు. ఎందుచేతనంటే అక్కడ దేహబుద్ధి పోయింది. నీకు దేహబుద్ధి పోయింది అనుకో ఇంక నువ్వు సృష్టిని దాటి వెళ్ళిపోతావు. సృష్టి ఈశ్వరుడి కంట్రోలులో ఉంటుంది. నువ్వు సృష్టిని దాటేస్తే ఇంక ఈశ్వరుడు చేసేది ఏమీ లేదు. నీకు ఎప్పుడైతే రీలైజేషన్ వచ్చిందో శరీరం ఉన్నా శరీరం చనిపోయిన వాళ్ళు ఎలా ఉంటారో నువ్వు కూడా అలాగే ఉంటావు. దేహంతోటి నీకు తాదాత్మ్యం ఉండదు. దేహం యొక్క ప్రభావం నీ మీద పడదు. అప్పుడు శరీరానికి సంబంధించినది కాని,

మనస్సుకు సంబంధించినది కానీ, డెస్టినీకి సంబంధించినది కానీ ఏ రకమైన దుఃఖం నిన్ను ఏమీ చేయలేదు. నీ ప్రారబ్దకర్మ మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా నీకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే హేపీనెస్ వచ్చేస్తుంది. మీరు గురువుకు పూజ చేసినా, సేవ చేసినా గురువు యొక్క ఋణం తీర్చుకోలేరు. ఎందుచేతనంటే నీకు దుఃఖ కారణం ఉన్నా నిన్ను దుఃఖంలేని స్థితికి మోసుకొని పోతాడు. వాడు గురువు. కొంతమంది గురువులు ఎటువంటివారు అంటే మీరు యింటికి వెళ్ళి జపం, ధ్యానం చెయ్యనక్కరలేదు, వారు చెప్పింది శ్రవణం చేస్తే చాలు మనకు జ్ఞానం వచ్చేస్తుంది. అలా రాని పద్ధతిలో మీరు ఇంటికి వెళ్ళిన తరువాత గురువు చెప్పింది మీ మనస్సులో మననం చెయ్యాలి. ఎప్పటివరకు అలా చెయ్యాలి అంటే మీరు ఏదిగా ఉన్నారో అందులో మీరు స్థిరపడాలి. మీకు దేహబుద్ధి ఎంత సహజంగా ఉందో అంత సహజంగా మీరు హృదయంలో ఏదిగా ఉన్నారో అందులో మీరు స్థిరపడాలి.

## అనుగ్రహభాషణములు

✍ ప్రియమైన ఆత్మబంధువుల్లారా! భగవంతుడు భక్తి, కర్మ, ధ్యాన, జ్ఞాన యోగములు మాత్రమే చెప్పాడు. కానీ నన్ను అడిగితే అర్థము చేసుకొనుట కూడా ఒక యోగమే. అర్థమైతేనే కదా మీకు శ్రద్ధ కలిగేది.

✍ ఈశ్వరుడు మన హృదయంలో ఉన్నాడు. మినహాయింపులు లేకుండా ఆయనకు శరణాగతి చేయటం వలన దుఃఖం నశిస్తుంది, పరమార్థం అందుతుంది.

✍ అరుణగిరి జ్ఞానగిరి, శాంతిగిరి. పూర్వజన్మలో జ్ఞానమార్గములో సాధన చేసిన వారిని ఆకర్షించి వారి మనోచాపల్యమును తొలగించి జనన మరణములు లేని స్థితిని ప్రసాదిస్తుంది.

✍ రమణస్వామి మరణానుభవం ద్వారా ఆత్మానుభవం పొంది అరుణాచలమును కేంద్రముగా పెట్టుకొని లోకమునకు ఆత్మవిద్యను బోధించి మహాగురువుగా, మహాజ్ఞానిగా ప్రకాశించాడు.

✍ బోధించటంతోపాటు అనుగ్రహించగలిగినవాడే నిజమైన గురువు. గురువు మౌనంగానే బోధిస్తాడు. అవసరమైతే మాట ద్వారా, చూపు ద్వారా, స్పర్శ ద్వారా బోధించి మనస్సును పవిత్రం చేస్తాడు.

✍ మన క్షేమం కోరేవాడు, మన హితవు కోరేవాడు మనకు గురువు. గురువు మీద గురి కుదరాలి. గురువు మన హృదయంలో ఆత్మగా ఉన్నాడు. అవసరమైతే ఆత్మ బాహ్యముగా గురురూపం ధరించి వచ్చి మనకు బోధించి సంస్కరిస్తుంది. అన్ని ప్రేమలకంటే గురువు ప్రేమ గొప్పది. హెచ్చు తగ్గులు లేనిది. అనుగ్రహమునకు

మరొకపేరు గురువు. మనం ఏ జన్మలో ఉన్నా గురువు అనుగ్రహం మనలను వెంటాడి ఆత్మజ్ఞానంలో స్థిరపరుస్తుంది.

- ఈశ్వరుని నిరంతరము ఆరాధిస్తే ఆయనే గురురూపం ధరించి వచ్చి మనకు బోధించి అనుగ్రహిస్తాడు.
- ఆత్మ సాక్షాత్కారము పొందినవాడు మాత్రమే గురువు. ఏ గురువు ద్వారా మనం తరించవలసి ఉందో ఆ గురువుపట్ల మనకు ఆకర్షణ కలుగుతుంది. ఆయనను స్మరించుకోవటం వలన శాంతి లభిస్తుంది, దుఃఖం నశిస్తుంది. శరీరములు మారినా ఆత్మజ్ఞానము కలిగే వరకు గురువుతో ఉన్న సంబంధం తెగదు. గురువే దైవము, గురువే ఆత్మ.
- సాధకుడి మానసము పక్వస్థితికి వచ్చినప్పుడు లోపల ఉన్న ఈశ్వరుడే బాహ్యంగా ఒక రూపం ధరించి గురురూపంలో వచ్చి ఆత్మవిద్యను గురించి బోధిస్తాడు. అనుగ్రహం అనేది ఆయన బోధ రూపంలో ఉంటుంది. నిజమైన గురువు బోధ స్వరూపుడుగానే ఉంటాడు. గురువు యొక్క బోధ సాధకుడి మనస్సును హృదయాభిముఖంగా పయనించేటట్లు చేస్తుంది. మనస్సు హృదయంలో నిలబడుతుంది. అప్పుడు ఈశ్వరుడే సాధకుడికి తన స్వరూపంగా వ్యక్తమవుతాడు. అదే పరమస్థితి.
- అవతార పురుషుడి యొక్క రూపమును ధ్యానిస్తూ, నామమును స్మరిస్తూ మన నామరూపములకు దూరం కావాలి. మనరూపబుద్ధి, నామబుద్ధి నశించిన వెంటనే ఆత్మ లభిస్తుంది.
- సాధుజనులతో సాంగత్యం వలన మనస్సు చల్లబడుతుంది, దుఃఖం నశిస్తుంది, దైనందిన జీవితంలో మనకు కావలసినవి అన్నీ లభిస్తాయి.
- ఈశ్వరానుగ్రహం వలననే ప్రయత్నం చేయాలనే బుద్ధి కలుగుతుంది. అనుగ్రహం ప్రయత్నం చేసేవాడి యొక్క అర్హతను బట్టి, యోగ్యతను బట్టి వస్తుంది.
- నిప్పు కాల్చకుండా ఉండలేదు. జ్ఞాని అనుగ్రహించకుండా ఉండలేడు.
- జ్ఞానం అనేది మనస్సుతో సంపాదించేది కాదు. మనస్సు అణిగినచోట జ్ఞానం ఉదయిస్తుంది.
- మనం చేసే పని అహంభావనను సంతృప్తిపరచేదిగా కాకుండా జ్ఞాన సముపార్జనకు సహాయపడేదిగా ఉండాలి.
- నీకు వచ్చే కష్టములు భగవంతునికి తెలియకుండా రావటం లేదు. వాటిని నీవు

ఇష్టంతో అనుభవిస్తే ప్రారబ్ధం నశిస్తుంది. పునర్జన్మ హేతువులు ఉదయించవు. భగవదనుభవం కలుగుతుంది.

- ✍ మనో మూలము మన హృదయంలోనే ఉంది. వైరాగ్య సంపద లేకుండా మనం మన హృదయంలో ప్రవేశించలేము.
- ✍ విషయాల మీద నీకు ఆకర్షణ తగ్గాలంటే నిరంతరము ఈశ్వరుని చింతించాలి. అప్పడు ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. అనుగ్రహం వలన మాత్రమే నీవు బాహ్య ఆకర్షణల నుండి బయట పడగలవు.
- ✍ దేవుడు లేడు అని చెప్పేవారు ఉంటారుగాని సుఖం అవసరంలేదు అని చెప్పేవారు ఉండరు. దేవుడు, జీవుడు మనలోనే ఉన్నారు. జీవ లక్షణాలను తొలగించుకొంటే మన హృదయంలో ఉన్న దేవుడు మనకు సుఖంగా, శాంతిగా, ఆనందముగా వ్యక్తమవుతాడు. మానవుడికి కావలసినది సుఖమే గాని దేవుడు కాదు.
- ✍ ఈ సృష్టికి ఒక కర్త ఉన్నాడు. ఆయనను మనం ఈశ్వరుడు అని పిలుస్తాము. ఈ లోకంలో ఉన్న సొత్తు అంతా ఈశ్వరుడిదే. సొత్తు కలవాడినే స్వామి అంటాము. మనది అంటూ ఏమీ లేదు. ఆయనది ఆయనకే ఇచ్చి మనం ఇచ్చాము అనుకొంటాము. అలా అనుకోవటానికి కారణం మన బేధబుద్ధి. బుద్ధి శుద్ధి అయితేగానీ సమబుద్ధి కలుగదు. సమబుద్ధి లేనివాడికి కర్తృత్వం ఉదయిస్తుంది. మనిషి కూడా తన నీడ ఎలా ఉంటుందో కర్తృత్వ బుద్ధి ఉన్నవాడు ఏ దేహంలో ఉన్నా, ఏ లోకంలో ఉన్నా వాడిని దుఃఖం వెంటాడుతూ ఉంటుంది.
- ✍ సుఖం హృదయంలోనే ఉంది. బాహ్యమైన రూపములకు, నామములకు, వస్తువులకు ఆకర్షింపబడేవాడికి తన హృదయంలో ఉన్న సుఖం తెలియదు. మనస్సు హృదయంలో లయమైనవాడికి సుఖం స్వరూపంగా వ్యక్తమవుతుంది.
- ✍ మానవుడికి నిదానము అవసరము. వాడి ఆలోచన సమగ్రంగా ఉంటుంది, లోతుగా ఉంటుంది. అహంకారబుద్ధి లేనివాడు తక్కువ మాట్లాడతాడు, భగవదనుభవం పొందటానికి ఎక్కువ ప్రయత్నం చేస్తాడు. సత్యాన్వేషకుడికి మాటలకంటే ప్రయత్నం ముఖ్యం.
- ✍ జ్ఞాన సముపార్జనకు పూజ, జపం, ధ్యానం సహకరిస్తాయి. జ్ఞానము శరణాగతితో పరిసమాప్తం అవుతుంది. శరణాగతి పొందినవాడికి జరిగేదంతా ఈశ్వర సంకల్పమే అని అవగాహన అవుతుంది.
- ✍ మనము నిరాడంబరముగా, నిరహంకారముగా ఈ లోకములో ఏ పని చేసినా

ఈశ్వరుడు దానిని పూజగానే పరిగణిస్తాడు. ఈశ్వరార్పణ బుద్ధితో మనం పనిచేయటం నేర్చుకొంటే, కర్తృత్వభావన పలుచ బడుతుంది, చిత్తశుద్ధి కలుగుతుంది. ఆత్మజ్ఞానమునకు చిత్తశుద్ధి ద్వారం వంటిది.

✍ యాంత్రికంగా జీవించేవాడికి ఈశ్వరానుగ్రహం అందదు. ఈశ్వరుడు ప్రేమ స్వరూపుడు. మన తలంపు, మన మాట, మన చేత ప్రేమతో నిండి ఉండాలి. ప్రేమను శ్రవణం చేయాలి, ప్రేమను చూడాలి, ప్రేమను ధ్యానించాలి. ప్రేమమయజీవితము ఈశ్వర సాక్షాత్కారమునకు ద్వారం లాంటిది.

✍ నేను అను తలంపు ఉదయించకముందు మనం ఏ స్థితిలో ఉన్నామో అది మన నిజమైన స్థితి. నిజమైన స్థితి మాత్రమే శాశ్వతంగా ఉంటుంది. నేను అనే తలంపును మనం నిజము అని అనుకొన్నా అది నిజం అవ్వదు. మనం నమ్మినంత మాత్రంచేత అనిజం నిజం కాదు. విచారణ చేసి నేను అనే తలంపుకు మూలమైన హృదయగుహలోనికి ప్రవేశిస్తేనే గాని మనకు పరమార్థం తెలియదు. అంతర్యామిగా ఉన్న పరమాత్మ మాత్రమే నిజము. ఆ నిజం మనకు ఎరుకపడేవరకు స్వేచ్ఛ లేదు, శాంతి లేదు.

✍ మన దేహము కంటే, మన ఇంద్రియములకంటే, మన మనస్సుకంటే సద్వస్తువు మనకు అత్యంత సమీపములో ఉంది. దానిని మాత్రమే మనం తెలుసుకోవలసి ఉంది. ఏ వస్తువులో మనం ఐక్యం కావాలో దానిని గురించి ప్రీతిగా శ్రవణం చేస్తూ, ప్రేమగా మననం చేస్తే అది మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. జీవితంలో మనం పొందవలసిన పరమస్థితి అది మాత్రమే.

✍ మన మీద ఈశ్వరానుగ్రహం లేకుండా ఈశ్వరుని స్మరించలేము. అంతా ఆయన అనుగ్రహమే. దుఃఖం కూడా ఆయన అనుగ్రహమే అని గుర్తించిన వారు ధన్యులు. ఈశ్వర సాక్షాత్కారము పొందుటకు అనుదినము ప్రయత్నం చేస్తూనే ఉండాలి. ప్రయత్నం లేని స్థితి మనకు సహజం అయ్యేవరకు ప్రయత్నమును త్యజించకూడదు.

✍ మనస్సు పచ్చిగా ఉండకూడదు, చేదుగా ఉండకూడదు. దానికి తియ్యదనం పట్టించాలి. అది మన ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుంది. మనస్సుకు పరిపక్వ స్థితి వచ్చినప్పుడు దానికి అంతర్దృష్టి కలుగుతుంది. హృదయాభిముఖంగా పయనించి హృదయంలో లయమవుతుంది. అప్పుడు మన లోపల, బయట, పైన, క్రింద అంతటా వ్యాపించిన వస్తువు మనకు సాక్షాత్కరిస్తుంది.

✍ అన్ని దానములలోనికి నిదానము గొప్పది. నిదానమే ప్రధానము. ప్రతీ చిన్న

సంఘటనకు ఆవేశపడేవాడు జీవితంలో చాలా నష్టపోతాడు. ఆవేశపరుడు ఆలోచనకు దూరమవుతాడు. ఆలోచన అమృతంతో సమానము. సమగ్రంగా ఆలోచించడానికి భగవంతుడు మనకు బుద్ధిని ప్రసాదించాడు. సోమరితనమునకు అలవాటుపడిన బుద్ధి నుండి మనం స్వేచ్ఛను పొందాలి. మానవజీవితంలో బుద్ధి నిర్వహించే పాత్రను ఎవరూ కాదనలేరు. ఏకాంతవాసము బుద్ధి వికసించుటకు కొంతవరకు సహకరిస్తుంది.

✍ ఇతరులలో ఉన్న మంచిని చూచుటకు మనం అలవాటుపడాలి. దాని వలన మన మనస్సుకు చల్లదనం కలుగుతుంది, లోతుగా ఆలోచించ గలము. ఇతరులలో ఉన్న చెడును చూస్తే మనకు అజ్ఞానం పెరుగుతుంది. మనస్సుకు వికలత్వం వస్తుంది. శారీరక ఆరోగ్యం కూడా నశిస్తుంది. ఇతరులలో ఉన్న మంచిని చూసి ఆనందించేవాడికి ఈశ్వరానుగ్రహం కలుగుతుంది.

✍ గాఢనిద్రలో ఉన్న సుఖమును మనం జాగ్రదవస్థలో ఎరుకతో అనుభవించాలి అదే సమాధి స్థితి.

✍ ప్రకృతి వలన వచ్చే బాధలకంటే మన మనస్సు కల్పించే బాధలు ఎక్కువగా ఉంటాయి. ఎవరి మనస్సు వారికి శిక్ష. పూర్వజన్మలలో మనం చేసిన పొరపాట్లు, మన బలహీనతలు మనస్సులోనే ఉంటాయి. మనస్సులో బలహీనతలు ఉన్నంతకాలము దేహములు వస్తాయి. దేహము కూడా ఒక శిక్ష. దేహము పుట్టినప్పుడు దాని కూడా కోరిక, కోపము, భయము ఇవి అన్నీ కూడా వస్తాయి. అవి మన చేత పాపము చేయిస్తాయి. ప్రయత్నము చేసి సత్పురుషులతో సహవాసం చేసి ఈశ్వరానుగ్రహం సంపాదిస్తే ఈ నరక ద్వారములు నశిస్తాయి. జ్ఞానమునకు మనస్సు, దేహము, లోకము అడ్డుగానే ఉంటాయి. భగవంతుని యందు భక్తిని సంపాదించి మనస్సులో ఉన్న దుర్గుణాలను తొలగించుకొని పరిమితులు లేని జ్ఞానమును పొందాలి. జ్ఞానమే శాంతి, జ్ఞానమే ఆనందము, జ్ఞానమే వేదాంతము.

✍ కొంతమందికి దూరదృష్టి ఉంటుంది. అపరిమితమైన భక్తి ఉంటుంది, లోచూపును అలవర్చుకొంటారు. ఏ కారణముల వలన ఇతరులకు కష్టం కలిగిందో ఆ కారణములకు దూరంగా ఉంటారు. వివేకశూన్యుడు కష్టం తనదాకా వస్తేగాని అర్థం చేసుకోలేడు. వివేకవంతుడు సాంఘిక విలువలకు ఎంత ప్రాధాన్యం ఇస్తాడో ఆధ్యాత్మిక విలువలకు కూడా అంత ప్రాధాన్యత ఇస్తాడు.

✍ లోకానికి ఒక కర్త ఉన్నాడు. ఆ కర్తనే ఈశ్వరుడు అని అంటారు. ఈ లోకంలో ఏ

చిన్న సంఘటన జరిగినా ఈశ్వరాజ్ఞ లేకుండా జరుగదు. జరిగేదంతా ఈశ్వర సంకల్పమని జ్ఞానికి తెలుస్తుంది. ఈశ్వర సంకల్పములోనే జ్ఞాని లీనమై ఉంటాడు. జ్ఞాని తన భారమంతా ఈశ్వరుడి మీద వేసి శాంతిగా ఉంటాడు.

✍ స్తుతి, నిందలకు దూరంగా ఉన్న వాడికి దేహబుద్ధి పల్చబడుతుంది. దేహబుద్ధి తక్కువగా ఉన్నవాడు ఇతరులకు సంతోషాన్ని ఇస్తాడు. దేహబుద్ధి ఎక్కువగా ఉన్నవాడు ఇతరులకు దుఃఖాన్ని ఇస్తాడు. దేహబుద్ధి తక్కువ ఉన్నవాడు తనకంటే కూడా ఇతరులను ఎక్కువగా ప్రేమిస్తాడు. దేహబుద్ధి ఎక్కువ ఉన్నవాడు ఇతరులకంటే తనను తానే ఎక్కువ ప్రేమించుకొంటాడు.

✍ దేహమును, వాక్కును, మనస్సును నియమించుకోవాలి. వాటితో సత్కర్మలను ఆచరించి భగవంతుని అనుగ్రహమును సంపాదించాలి. ఆయన అనుగ్రహం లేకుండా పరమస్థితిని పొందలేము.

✍ ఈశ్వరుడికి పక్షపాతము లేదు. ప్రస్తుతం మనకు ఉన్న తలంపులు, ఈ జన్మలో మనం చేస్తున్న కర్మలు భవిష్యత్‌లో మనకు విధిగా ఏర్పడతాయి. ఉజ్వల భవిష్యత్తులో ప్రవేశించుటకు మన బలహీనతలే మనకు అడ్డంకులుగా ఏర్పడతాయి.

✍ మనం ఎవరిమో మనకు తెలియకపోవటమే అజ్ఞానము. ఈ అజ్ఞానమును ఆధారముగా చేసుకొని కామక్రోధములు ఉదయిస్తాయి. కామక్రోధముల యొక్క వేగము ఎక్కువగా ఉన్నవాడికి ఆలోచన నశిస్తుంది. ఆలోచన లేనివాడికి అన్ని సంపదలు దూరమవుతాయి.

✍ మానవుడు తన జీవితమును పొడిగించుకొనుటకు ఇస్తున్న ప్రాముఖ్యత అహంభావన తొలగించుకొనుటకు ఇవ్వటంలేదు. దీనికి వాడిలో ఉన్న పాపమే కారణము. ఈశ్వరుడిని ప్రార్థించుట వలన, ధ్యానించుట వలన పాపము నశిస్తుంది. పాపచింతన లేనివాడికి మాత్రమే అహంభావన తొలగించుకోవాలనే సద్బుద్ధి ఉదయిస్తుంది.

✍ మన హృదయంలో ఏ సద్వస్తువు అయితే ఉందో అదే మనము. దాని స్వరూపమే మోక్షము. దాని గురించి నిరంతరము శ్రవణం చేసి ఆ సద్వస్తువును ధ్యానం చేస్తే అదే మనకు స్వరూపముగా వ్యక్తమవుతుంది. అదే జీవిత గమ్యం.

✍ పనిలో భగవంతుని చూడటం నేర్చుకోవాలి. భగవంతుడు చెప్పిన విధంగా పని చేస్తే పవిత్రులము అవుతాము. పని మనలను బంధించదు. ఫలితము పట్ల మనకు ఉన్న ఆసక్తి మాత్రమే బంధిస్తుంది. కర్మఫల త్యాగికి చిత్తశుద్ధి కలుగుతుంది.

ధ్యానపరునికి ఏకాగ్రత సిద్ధిస్తుంది. చిత్తశుద్ధి, ఏకాగ్రత ఈ రెండూ ఉన్నవాడికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుంది. అతనికి అసాధ్యం అంటూ ఏమీ ఉండదు.

- మనస్సు కూడా ఒక సమస్య. అది మన స్వంత సమస్య. దానిని మనమే పరిష్కరించుకోవాలి. మనస్సును స్వాధీనం చేసుకొంటే సుఖపడతాము. అది మన స్వాధీనంలో లేకపోతే మన శత్రువులకంటే కూడా అధికముగా అది మనకు హాని చేస్తుంది. స్వాధీన మనస్కులు మంచివారు అవుతారు. స్వాధీనంలోలేని మానసము కలవారు దుష్టులు అవుతారు. మనోనిగ్రహం కలవారు మరణానంతరము స్వర్గమునకు వెళితే మనో నిగ్రహము లేనివారు నరకమునకు వెళతారు. మనం బాగుపడినా, పతనమైనా, కృంగిపోయినా మనస్సే కారణం.
- విషయచింతన వలన అజ్ఞానము పెరుగుతుంది. ఆత్మచింతన వలన జ్ఞానోదయం అవుతుంది. జ్ఞాన సముపార్జన లేకుండా అజ్ఞానము నశించదు. మనం ఎవరిమో మనకు తెలిస్తే అది జ్ఞానం. మనం ఎవరిమో మనకు తెలియకపోతే అది అజ్ఞానం.
- సముద్రంలో అలలు ఎలా పుడుతున్నాయో మనస్సులో రాగద్వేషములు అలా పుడుతూ ఉంటాయి. లోకములో ఏ మూల చూసినా రాగద్వేషములే ఉంటాయి. రాగద్వేషముల యొక్క వేగము మానవునికి భగవదనుభవం కలుగకుండా అడ్డు వస్తున్నది.
- భగవదనుభవం పొందటానికి మనం చేసే ప్రయత్నమును సాధన అని అంటారు. శ్రద్ధ మీద సాధన ఆధారపడి ఉంటుంది. భగవదనుగ్రహం పొందుటకు అవసరమైన సామాగ్రిని శ్రద్ధ సమకూరుస్తుంది. ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము ఈ రెండూ సాధనలో ముఖ్యభాగములు. హృదయంలో సిద్ధముగా ఉన్న వస్తువును తెలుసుకొనుటకు నిరంతరము ప్రయత్నం చేస్తే సాధకుడు సిద్ధుడు అవుతాడు.
- అహంభావన ఉన్న మానవుడు నిర్మలంగా, సహజంగా ఉండలేడు. వాడి మనస్సులో నుండి ఎప్పడూ రసికారుతూ ఉంటుంది. ఆ రసిలో నుండి మానసిక రుగ్మతలు పుడతాయి. ఎవడైతే అహంభావన నుండి విడుదల పొందలేడో వాడు లోక కళ్యాణం కోసం కూడా కృషిచేయలేడు. లోపల మారకుండా బయట మార్పు తీసుకొని రాలేము.
- వివేకము, వైరాగ్యము, సద్బుద్ధి, సహృదయం లేకుండా సత్య సాక్షాత్కారము కలుగదు. సత్యమును దర్శించుటకు సజ్జనుల సహవాసము ఎంతగానో సహకరిస్తుంది. దుష్టసహవాసం వలన చెడు తలంపులు వస్తాయి. కర్తృత్వము పెరుగుతుంది, దుఃఖం వెంటాడుతుంది.
- ఈశ్వరానుగ్రహం వలన ఈశ్వరునిలో ఐక్యమవ్వాలి అనే కాంక్ష కలుగుతుంది. ఏ

శక్తి మనలను సాధనలో ప్రవేశపెట్టిందో ఆ శక్తే మనము పరమస్థితికి చేరుకొనేవరకు విడిచిపెట్టదు. భోగి భౌతిక వస్తువులను మాత్రమే కోరుకొంటాడు. యోగి అజ్ఞాన కారణమును తొలగించు కొనుటకు ప్రయత్నిస్తాడు. ఉన్నది ఆత్మ మాత్రమే. ఆత్మ కాని దానిలో నుండి విడుదల పొందుటకు ప్రయత్నం చేసేవాడిని సాధకుడు అని అంటాము.

✍ పరిమితమైన వస్తువు నశిస్తుంది. అంతటా ఉన్న వస్తువుకు పరిమితులు లేవు. పరిమితులను కల్పించేది, దేశకాలములకు బంధించేది దేహబుద్ధి మాత్రమే. దేహబుద్ధి నశించిన మరుక్షణంలో అపరిమితమైన వస్తువు తెలియబడుతుంది. జ్ఞానికి దేహం ఉన్నా, లేకపోయినా తన అస్థిత్వము నకు భంగం లేదు. అజ్ఞాని మరణానంతరము ప్రయాణం చేస్తాడు. జ్ఞానికి పరిమితులు లేవు కాబట్టి అంతటా ఉన్నది తానే అని తెలుసుకొంటాడు.

✍ అంతా ఆత్మే. ఆత్మ దేహముగా ఉండగలదు, మనస్సుగా ఉండగలదు, లోకంగా ఉండగలదు. ఇవి అన్నీ లేకుండా కూడా ఉండగలదు. ఆత్మ సాక్షాత్కారమునకు మించిన స్థితి లేదు.

✍ గ్రంథములు ఆత్మజ్ఞాన సముపార్జనకు మార్గమును సూచిస్తాయి. కాని ఆ మార్గములో ప్రయాణం చేసి ఆత్మజ్ఞానమును మనం పొందాలి. ఈనాటికైనా, ముందునాటికైనా ఆత్మానుభవం హృదయంలోనే కలుగుతుంది. హృదయంలో సద్వస్తువు ఉంది కాని గ్రంథములలో లేదు. గ్రంథముల వలన పాండిత్యం వస్తుంది. హృదయంలో వెతికితే అమృతత్వం కలుగుతుంది.

✍ భ్రమకు కారణం అజ్ఞానం. భ్రమలో ఉన్నవాడికి లేని వస్తువు ఉన్నట్లుగా, ఉన్న వస్తువు లేనట్లుగా కనబడుతుంది. భ్రమ నశిస్తేనేగాని బ్రహ్మం తెలియబడదు.

✍ బ్రాహ్మీస్థితిని పొందినవాడి ద్వారా లోకమునకు ఎంతో మేలు జరుగుతుంది. బ్రాహ్మీస్థితిని పొందినవాడు మాత్రమే శాంతినేత, శాంతి దాత కూడా. అతనిని చూసి, అతనిని సేవించి ఎంతోమంది ఆధ్యాత్మిక ప్రగతిని సాధిస్తారు.

✍ భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. నిశ్శబ్ధంగా పనిచేస్తున్నాడు. ఆయన ఏవిధంగా పనిచేస్తున్నాడో అదేవిధంగా మనం పనిచేస్తే ఆయన దయ మనమీద వర్షిస్తుంది. ఆయన దయ లేకుండా మన బలహీనతల నుండి, దోషములనుండి, లోపములనుండి విడుదలపొందలేము. ఆయన దయను సంపాదించి దేహానికి లోకానికి బంధించే మన అలవాట్ల నుండి విడుదలపొందాలి.

- కర్మఫలం అనుభవిస్తే నశిస్తుంది. ఇష్టంగా అనుభవిస్తే కొత్తవాసనలు రావు, పాత వాసనలు పోతాయి. కర్మఫల త్యాగికి చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే ఆత్మజ్ఞానం లభ్యమవుతుంది. ఆత్మజ్ఞానం లేకుండా ఆత్మను తెలుసుకోలేము. ఆత్మ యొక్క స్వరూపమే జ్ఞానము, అదే మోక్షము.
- నామ రూపములతో కూడినదే సంసారం. అజ్ఞాని సత్యమును నామ రూపములకు పరిమితం చేస్తాడు. జ్ఞాని సత్యమును నామరూపములకు పరిమితం చేయడు. తనను తాను చూసుకొని లోకాన్ని చూస్తే మానవుడిని లోకం బంధించదు. జ్ఞానికి లోకం తన హృదయంలో లయమవుతుంది. అందువలన లోకం కూడా ఆత్మగానే కనిపిస్తుంది.
- కోరిక వలన మనస్సు చలిస్తుంది. చలించే మనస్సును నిరంతరము ఆత్మయందు నిలబెట్టి ఉంచితే అది లయిస్తుంది. దాని పీడ విరగడ అవుతుంది. దుఃఖ కారణం మనస్సులోనే ఉంది. మనస్సు నశిస్తే దుఃఖం నశిస్తుంది.
- సత్వగుణమును సంపాదించుకోవాలి. సత్వగుణం ఆధ్యాత్మిక సంపద, సాత్విక బుద్ధి సంపాదించిన వాడికి మనస్సు అణుగుతుంది, అంతర్‌దృష్టి కలుగుతుంది. తెలివితక్కువవాడు తెలివైనవాడుగా మారతాడు. సత్వగుణం మనస్సును అంతర్ముఖపరుస్తుంది. రజోగుణం, తమోగుణం మనస్సును బాహ్యముఖపరుస్తాయి. మనస్సు అంతర్ముఖమైతే అవినయం నశిస్తుంది, శాంతి కలుగుతుంది. మనస్సు బాహ్యముఖమైతే ఆందోళన, అశాంతి వెంటాడుతాయి. అంతర్ముఖ దృష్టి కలవాడు పవిత్రుడు అవుతాడు. పవిత్రత లేకుండా మోక్షసుఖమును సాధించలేము.
- ఎంతకాలము మనం సాధన చేసాము అనే విషయం కంటే ఎంత శ్రద్ధగా చేస్తున్నామో చూసుకోవాలి. శ్రద్ధ ప్రధానము. శ్రద్ధ ఉన్నవాడు ఆత్మజ్ఞానమునకు వలయు సామగ్రిని సంపాదించుకుంటాడు. శ్రద్ధ అను రెండు అక్షరములను మరువకూడదు.
- శాంతి హృదయంలో ఉంది. హృదయంలో వెతికితే అది లభిస్తుంది. శాంతి లేని చోట ఎన్ని జన్మలు వెతికినా శాంతి లభించదు. హృదయ విద్యను శ్రవణం చేసి, మననం చేసి, అర్థం చేసుకొని ఆచరిస్తే శాశ్వత మైన శాంతి కుటీరమును చేరుకొంటావు.
- ఈశ్వరుడు సర్వసాక్షి, కర్మఫలదాత. ఆయన మన హృదయంలో సజీవముగా ఉన్నాడు. సాధకుడికి హృదయనివాసి అయిన ఈశ్వరుడిపట్ల దృఢ విశ్వాసం ఉండాలి. అతని విశ్వాసమే అతనిని విషయచింతన నుండి విడుదల చేస్తుంది.

అభ్యాస వైరాగ్యముల వలన మనస్సుకు తూకం పెరిగి హృదయపు లోయలలో ఉన్న ఈశ్వరుడియందు ఐక్యమవుతుంది.

✍ మన పురోగతికి మనస్సే కారణం, మన అధోగతికి మనస్సే కారణం. మనస్సు మనం కాకపోయినా అది మనకు పనిముట్టు. దానిని శుచిగా ఉంచాలి. మనస్సులోనికి మంచితలంపులు ప్రవేశించేటట్లు చూసుకుంటే మంచి మార్గములో ప్రయాణం చేయగలము. మనస్సును సత్వగుణంతో నింపాలి. సాత్విక మనస్సు మాత్రమే మన గతి అయిన మోక్షములో ప్రవేశపెడుతుంది. మనోనిగ్రహం లేనివాడు మనస్సును నియమించలేడు. నియమింపబడిన మనస్సు మాత్రమే మానవుడిని ఉజ్వల భవిష్యత్తులోనికి తీసుకొనివెళుతుంది.

✍ ఇంటిలో బంగారం ఉన్న వాడికంటే మనస్సును బంగారం చేసుకొన్నవాడు ఎక్కువ సుఖపడతాడు. మనస్సును శాంతితో నింపితే అది ఆత్మాకారం చెందుతుంది. మరణానంతరము మనకూడా వచ్చేది మన మనస్సే. అందువలన మానసిక ఆరోగ్యమును జాగ్రత్తగా చూసుకోవాలి. పరిశుద్ధమైన మానసము కలవాడు ఈ లోకములో అదృష్టవంతుడు.

✍ మన ఆలోచనలోగాని, మాటలోగాని, నడవడికలోగాని ఆడంబరము పనికిరాదు. ఆడంబరము అవినయమును పెంచుతుంది. అవినయము ఆధ్యాత్మిక సంపదకు దూరం చేస్తుంది. వ్యాపార భక్తి వలన అహంభావన పెరుగుతుంది. ప్రేమభక్తి వలన అహంభావన నశిస్తుంది. సమాజమును ఐక్యముగా ఉంచేది ప్రేమభావన. సమాజమును అనైక్యం చేసేది అహంభావన. ప్రేమ ఐక్యతను పెంచుతుంది. అహంభావన అనైక్యతకు నీరు పోస్తుంది. దేశభక్తి దైవభక్తి అవసరము. దేశభక్తి మనస్సు యొక్క పరిణతిని పెంచుతుంది. దైవభక్తి మోక్షమును ప్రసాదిస్తుంది.

✍ త్రికరణములైన మనస్సుతోటి, వాక్కుతోటి, శరీరముతోటి నారాయణుడిని నిరంతరము ఆరాధిస్తూ ఉంటే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము. వైకుంఠములో ఉన్న నారాయణుడే మన హృదయంలో నిజమైన నేనుగా ఉన్నాడు. నిజమైన నేనునే ఆత్మజ్ఞానము అని అంటారు. నారాయణుడి అనుగ్రహం మనకు ఉంటే లోకం అంతా కూడా నారాయణ స్వరూపముగానే కనిపిస్తుంది.

✍ సహజముగా జీవించాలి. కృత్రిమ జీవనమునకు అలవాటు పడకూడదు. కృత్రిమంగా జీవించేవాడు ఇతరుల లోపములను వెతుకుతూ ఉంటాడు. దాని వలన చిత్తశాంతికి దూరమవుతాడు, చిత్త క్షోభకు గురి అవుతాడు. నిజము సహజంగానే ఉంటుంది.

సహజంగా జీవించేవాడికి అది ఎరుక పడుతుంది.

- వైరాగ్యము కూడా సంపదతో సమానము. వైరాగ్యము లేనివాడికి ఆధ్యాత్మిక స్పృహ ఉండదు. జీవుడు సంసార సాగరమునుండి ఒడ్డుకు రావాలంటే వైరాగ్యబుద్ధిని అలవర్చుకోవాలి.
- మనిషిని చంపకుండా చంపే మందు ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞానము మీ దేహమును తీసివేయదు, మీ ప్రాణమును తీసివేయదు. మీ అహంభావనను తీసివేస్తుంది.
- దేవుని గురించి నోటితో చెప్పకొంటాము. అనుసరించేటప్పడు అహంభావన ఎలా చెపితే అలా అనుసరిస్తాము. దేవునికి అనుకూలంగా మన ప్రవర్తన ఉంటే దేవుడు తెలియబడతాడు. మన ప్రవర్తన అహంభావనకు అనుకూలంగా ఉంది కాబట్టి అహంభావన పెరిగిపోతూ ఉంటుంది.
- నీకు దేహబుద్ధి ఉంటే ద్వైతము, దేహబుద్ధి లేకపోతే అద్వైతము.
- స్మశానంలో దేహం కాలి బూడిద అయినప్పడు ఆ దేహమును ధరించిన జీవుడి యొక్క గుణములు కాలవు. జ్ఞానాగ్ని వలన మాత్రమే అవి దహించబడతాయి.
- నాదిని విడిచిపెడితే చిత్తశుద్ధి కలుగుతుంది. నేనును విడిచిపెడితే మోక్షం కలుగుతుంది.
- ఎవరి సమక్షంలో ఉన్నప్పడు నీ ప్రయత్నం లేకుండా మనోచాపల్యం ఆగిపోయిందో అతనిని మహాత్మునిగా గుర్తించవచ్చు.
- నీ హృదయంలో సత్య వస్తువు ఉంది. దానితో నిరంతరము కలిసి ఉండు అదే సత్సంగము.
- ఈశ్వరుడిపట్ల మనకు అకారణమైన భక్తి కలిగినప్పడు మనలను ఆత్మజ్ఞానముతో అలంకరిస్తాడు.
- అసత్యమునకు ప్రచారము కావాలిగాని సత్యమునకు ప్రచారము అవసరం లేదు.
- దుఃఖము లేని స్థితికి ఎదిగిన మానవుడిని ప్రపంచముగాని, దాని తాలూకు దుఃఖముగాని అంటదు.
- దేవునిచేతిలో మాయ ఉంది. మాయ చేతిలో మనం ఉన్నాము.
- ప్రపంచంలో అత్యంత నీచమైనది, ఎందుకు పనికిరానిది, మనం అసహ్యించు కోవలసినది, మనం పోగొట్టుకోవలసినది అహంవృత్తిని మాత్రమే ఇది పోకుండా మీరు ఏ లోకాలకు వెళ్ళినా దుఃఖం మిమ్ములను వెంటాడుతుంది.
- భగవంతుడు మనకు ఏ అవకాశమును ప్రసాదించాడో ఆ అవకాశములను

మానవజాతి క్షేమం కోసం ఉపయోగించాలి.

- శక్తి సహాయం లేకుండా ఏ పని మనం పూర్తిచేయలేము. ఆశక్తి భగవంతుడిదే. అందువలన మనం కర్తృత్వమును ఎంత తగ్గించుకొంటే అంత మంచిది. కర్తృత్వము నిశ్శేషముగా నశించినవాడికి పునర్జన్మ లేదు, దుఃఖం లేదు.
- భగవంతుడు మనకు అప్పగించిన పనిని ప్రీతిగా, ప్రేమగా చేసినట్లయితే పునర్జన్మ హేతువులు నశిస్తాయి.
- సజ్జనులతో సహవాసం స్వర్గమునకు దారి చూపిస్తుంది. దుష్టులతో సహవాసం నరకమునకు దారి చూపిస్తుంది.
- ఆసక్తి, భయము, కోపము తగ్గించుకొని జీవించటం నేర్చుకొంటే శాంతిపూరితమైన తలంపులు వస్తాయి. మానసిక ఆరోగ్యం బాగుపడుతుంది.
- అనుదినము మన మనస్సును అదుపులో పెట్టుకొని చేసే పని సంతోషంగా చేస్తూ ఉంటే జీవిత లక్ష్యమును సాధించగలము.
- శారీరక ఆరోగ్యమును, మానసిక ఆరోగ్యమును కాపాడుకొంటూ ఈ రెండింటి సహాయంతో ఈశ్వరదర్శనమును పొందవచ్చును.
- దేహప్రారబ్ధమును బట్టే మనం జన్మించే కుటుంబం నిర్ణయించ బడుతుంది. ప్రారబ్ధానుసారం బంధువులు, స్నేహితులు, విరోధులు ఏర్పడతారు. దేహమును ప్రారబ్ధమునకు వదిలిపెట్టి అమృతత్వమును పొందుటకు ప్రయత్నించవలెను.
- అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు అణిగిపోతే అంతా అణిగిపోతుంది. నిర్వాణ స్థితి లభిస్తుంది.
- సాధనచేసి హృదయం యొక్క లోతులను పెంచుకొన్నవాడిని బాహ్యసంఘటనలు బాధించవు.
- భగవంతుని సంకల్పమే నా సంకల్పము. భగవంతుని ఇష్టమే నా ఇష్టము అని అనుకొనేవాడికి శీఘ్రంగా మనోనాశనం అవుతుంది.
- ఇహమూ భగవంతుడే, పరమూ భగవంతుడే. అంతా భగవంతుడే అనుభావనతో సాధన చేసేవాడికి భగవదనుభవం కలుగుతుంది.
- వేదనకు, రోదనకు ఆసక్తి కారణం. ఆసక్తి నశిస్తే ఇవి రెండూ నశిస్తాయి.
- భగవంతుని మీద భారం వేసి చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చేస్తే మనస్సు చల్లబడుతుంది.
- వేరుభావన నశించినప్పడు దాని తాలూకు హద్దులు, పరిమితులు నశిస్తాయి, ఆనందం స్ఫురిస్తుంది.

- పునర్జన్మకు కారణం కర్తృత్వబుద్ధి. మానవుడికి కర్తృత్వబుద్ధి స్వరూపము కాదు, స్వభావముకాదు. అది ఒక అలవాటు. భగవంతుడిపట్ల భక్తి భావన పెంచుకొంటే ఈ అలవాటు నుండి విడుదల పొందవచ్చును.
- ఏ కర్మ సఫలం అవ్వాలన్నా మానవుని కృషి, దేవుని కృప రెండూ అవసరము.
- అజ్ఞానము నశించకుండా సంసారబంధం ఊడదు.
- ఎక్కడైతే భేదబుద్ధి ఉందో అక్కడ మోహం వస్తుంది, భయం వస్తుంది, క్రోధం వస్తుంది. అన్ని అనర్థాలకు భేదబుద్ధి కారణం.
- సాధు పురుషుల సాంగత్యం మంచిది. అందువలన అన్ని విధముల ప్రయత్నం చేసి సాధువులతో సహవాసం పోషించుకోవలెను.
- భౌతిక సంపద ఎంత ఉన్నా దైవీ సంపద లేకపోతే దుఃఖం నుండి విడుదల పొందలేడు.
- ఏ మానవుడిలో అయితే స్వార్థము, క్రూరత్వము లేదో అట్టి మానవుడి ద్వారా సమాజమునకు మేలు జరుగుతుంది.
- బ్రాహ్మీస్థితిని పొందినవాడు మాత్రమే భయం నుండి విడుదలవుతాడు.
- మినహాయింపులు లేకుండా ఈశ్వరుడికి శరణాగతి చేస్తే అన్ని వాంఛలు నెరవేరతాయి, చివరకు మోక్షం కూడా వస్తుంది.
- సుఖపడేవారికి పుణ్యప్రారబ్ధము, దుఃఖపడేవారికి పాపప్రారబ్ధము ఖర్చు అవుతోంది. ఈ ద్వంద్వములు మనస్సుకే పరిమితమై ఉన్నాయి. ప్రారబ్ధమును సహనముతో భరించాలి.
- మన దేహమునకు సుఖప్రారబ్ధము వచ్చినప్పుడు గర్వం రాకుండా చూసుకోవాలి. మానవుడి పతనమునకు గర్వమే కారణము.
- సమాజ పరంగాను, కుటుంబపరంగాను వచ్చే అన్ని కలహములకు అహంభావన మాత్రమే కారణము.
- శాస్త్ర జ్ఞానముతోపాటు అనుభవ జ్ఞానం కూడా అవసరము. మన అనుభవంలో లేని మాట ఇతరులకు బోధించినా వారికి బాట ఏర్పడదు.
- దేహగతమైన నేను కూడా ఒక తలంపు మాత్రమే. అయితే అది మూల తలంపు. ఆ తలంపును ఆధారంగా చేసుకొని మిగతా తలంపులు అన్నీ వచ్చి పీడిస్తున్నాయి.
- మనం ప్రయత్నం చేసి పోగొట్టుకోవలసింది దేహగతమైన నేనును మాత్రమే. పోవలసింది పోతే ఉన్నది ఏదో ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది, శాంతి లభిస్తుంది.
- ఆహార నియమము దేహ ఆరోగ్యమునకు, మానసిక ఆరోగ్యమునకు సహాయపడి

ఆధ్యాత్మిక పురోగతిని చేకూరుస్తుంది.

- కర్మఫలాన్ని ఆశ్రయించిన వాడు బద్ధుడవుతాడు, ఆశ్రయించనివాడు ముక్తుడవుతాడు.
- ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు. ఆయన మనకు అనుభవంలోనికి రాకుండా మన అంతఃకరణములోని అవగుణాలు అడ్డువస్తున్నాయి.
- మనస్సు ఎంత నిజమో సైన్స్ కూడా అంతే నిజము. సైన్స్ విషయజ్ఞానమే గాని ఆత్మజ్ఞానం మాత్రం కాదు.
- భౌతిక సంపదల పేరు మీద భోగలాలత్వం పెంచుకోకూడదు.
- ఏ సద్వస్తువును తెలుసుకోవటానికి నీవు సాధన చెస్తున్నావో అది నీవే అయి ఉన్నావు.
- ఆహారశుద్ధి లేకుండా ఇంద్రియ శుద్ధి రాదు. ఇంద్రియ శుద్ధి లేకుండా చిత్తశుద్ధి రాదు. చిత్తశుద్ధి లేకుండా ధ్యాననిష్ఠ రాదు. ధ్యాననిష్ఠ లేకపోతే నీకు ఆత్మనిష్ఠ రాదు. ఆత్మనిష్ఠ రాకపోతే నీకు దృశ్యం నశించదు. ఎప్పుడైతే ఆత్మనిష్ఠ వలన దృశ్యం నశించిందో అప్పుడు ఆత్మే మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.
- నీవు ఏదైతే కాదో దానితో కలిసి ఉండటం అహంవృత్తి. నీవు ఏదైతే అయి ఉన్నావో దానితో కలిసి ఉండటం అహంస్ఫురణ.
- ప్రపంచములో ఏ వస్తువులోను సుఖంలేదు. నీ స్వరూపంలోనే సుఖం ఉంది.
- భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొని ఆత్మ జ్ఞానమును సముపార్జించాలి.
- దేహప్రారబ్ధమును ఇష్టముతో అనుభవిస్తే హృదయం యొక్క లోతులు పెరుగుతాయి.
- జ్ఞాన సముపార్జనకు జ్ఞానమును తెలుసుకోవాలనే ఆకాంక్షే పెట్టుబడి.
- మనస్సు ఎంత నిజమో సైన్స్ కూడా అంతే నిజము. సైన్స్‌కు మానవజాతిని అనుగ్రహించే శక్తి లేదు. సైన్స్ దేహమును సుఖపెట్టవచ్చుగాని మనస్సుకు నిగ్రహమును ఇవ్వలేదు.
- మానవుడికి తిండి, బట్ట, నీడ అవసరము. కానీ అతని మనస్సును మాత్రం మోక్షమును పొందుటయందు నిలబెట్టి ఉంచాలి.
- ఎవరు ఏమతంలో జన్మించినా, ఎవరు ఏ గురువును ఆరాధించినా ప్రకృతిని దాటకపోతే శాంతిని పొందలేరు.
- అకారణ భక్తి జ్ఞానమునకు తల్లి వంటిది.
- ఎవరి ఉపాధి ద్వారా చైతన్యం ఎక్కువగా వ్యక్తమవుతున్నదో వారిని మనం గురువులని, జ్ఞానులని అంటాము.
- మాయ అనిర్వచనీయమైనది. దాని ప్రభావం వలన మనకు అసత్యము సత్యముగా,

అనిత్యము నిత్యముగా గోచరిస్తున్నది.

- మనకు తెలిసినా తెలియకపోయినా ఉన్నదేదో ఉంది, ఉన్నది లేకుండా పోదు. ఉండటమే మానవుని సహజస్థితి. దానిని తెలుసుకొనటమే నిర్వాణస్థితి.
- శాస్త్రమును చదివి, అర్థం చేసుకొని, ఆచరిస్తే ఆత్మసుఖము అనుభవమవుతుంది.
- జపధ్యానములు దేహబుద్ధిని పెంచుకోవటానికి కాదు, దేహబుద్ధిని తగ్గించు కోవటానికి అవి ఉద్దేశించబడ్డాయి.
- ఎవడైతే తనను తాను సంస్కరించుకొంటున్నాడో వాడి ద్వారా మాత్రమే లోకమునకు మేలు జరుగుతుంది.
- జ్ఞాని ఆత్మ విద్యను బోధించటంతోపాటు అనుగ్రహాన్ని కూడా ప్రసాదిస్తాడు.
- మనం భగవంతుడిలో నుండి విడిపోవటానికి కారణం మన అహంభావన మాత్రమే.
- మౌనంగా బోధించటం, కర్తృత్వం లేకుండా పనిచెయ్యటం, బహుజన్మల సాధన చేస్తేనేగాని ఇవి రెండూ సాధ్యం కాదు.
- మనం ఈ లోకంలోనికి వచ్చిన పని మర్చిపోకూడదు. ఆ పని ఆత్మజ్ఞాన సముపార్జనము.
- మన హృదయంలో ఒక నిజం ఉంది. అది ఎప్పుడూ ఉంటుంది. అది మనమై ఉన్నాము. అందువలన మనకు కూడా ఎప్పుడూ ఉండాలని ఉంటుంది.
- తీవ్రమైన సాధనతో పాటు ఈశ్వర కటాక్షము లేకపోతే పునర్జన్మ కారణములైన వాసనలు నశించవు.
- మన హృదయంలో ఉన్న అమృతత్వము అనుభవైకవేద్యం అయ్యేవరకు మనలను ప్రకృతి గుణములు విడిచిపెట్టవు.
- వివేకమును ఉపయోగించుకొని లోకము యొక్క ఆకర్షణల నుండి, వ్యామోహముల నుండి విడుదల పొందినవాడు మాత్రమే అలౌకిక స్థితిని పొందుతాడు.
- ఎవరిని చూస్తే నీకు మినహాయింపులు లేని ప్రేమ కలుగుతోందో ఎవరి సమక్షంలో నీకు శాంతి కుదురుతోందో వారిని నీవు గురువుగా పరిగణించవచ్చును.
- పవిత్రత, ఏకాగ్రత లేనివాడు బ్రహ్మమును పొందలేడు.
- గాఢనిద్రలో సుఖంగా ఉన్నాము కాని ఎరుకలేదు. జాగ్రదావస్థలో ఎరుక ఉన్నది కానీ సుఖంగా లేము. గాఢ నిద్రలోని సుఖం, జాగ్రదావస్థలోని ఎరుక ఈ రెండూ ఒకేసారి మనకు అనుభవైకవేద్యం అయితే మోక్షాన్ని పొందుతాము.
- జ్ఞానం సుఖం, అజ్ఞానం దుఃఖం.

- ఈశ్వరానుగ్రహం మన మీద వర్షించకపోతే ఆయన మాటలు, చేతలు మనకు అర్థం కావు.
- ధ్యానం ఏ ఫలితాన్ని ఇస్తుందో ఆసక్తి లేకుండా, స్వార్థం లేకుండా చేసిన పని కూడా అదే ఫలితాన్ని ఇస్తుంది.
- ఈ లోకాన్ని నియమించేవాడిని ఈశ్వరుడు అని అంటారు. ఈ లోకము ఆయనదే. ఆయనకు తెలియకుండా ఈ లోకంలో ఏ సంఘటన జరుగదు.
- మాయను మూల ప్రకృతి అని అంటారు. ఏది లేదో అది మాయ. ఏది ఉన్నదో అది సత్తు. సత్తు మాత్రమే జ్ఞానము. మూల ప్రకృతిని దాటలేని వాడు ఆత్మజ్ఞానమును పొందలేడు. ఆత్మజ్ఞానమును గురించి వినినంత మాత్రంచేత జీవన్ముక్తుడు కాలేడు. ఆత్మజ్ఞానం అనుభవంలోనికి వచ్చినవాడు జీవన్ముక్త స్థితిని సాధిస్తాడు.
- పుణ్యం సుఖం రూపములోను, పాపం దుఃఖం రూపములోను ఖర్చు అవుతాయి పుణ్యపాపములు మనస్సుకు పరిమితమైనవి. అణిగిన మనస్సు కలవాడిని ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు.
- దేహముతో తాదాత్మ్యం పొందేవాడు బద్ధుడవుతాడు. పరమాత్మతో తాదాత్మ్యం పొందేవాడు ముక్తుడవుతాడు.
- వ్యక్తిభావన తగ్గించుకొనుటవలన ఆత్మభావన పెరుగుతుంది.
- నాదిని విడిచిపెడితే చిత్తశుద్ధి కలుగుతుంది. నేనును విడిచిపెడితే జ్ఞానం కలుగుతుంది.
- మన చేతిలో ఉన్న పని ఇష్టంగా, శ్రద్ధగా, సమగ్రంగా చేస్తూ ఉంటే ఈశ్వరుడు మనలను ఎప్పుడు, ఎక్కడ, ఎలా అనుగ్రహించాలో ఆయన చూసుకొంటాడు. ఆయన చేతిలో ఉన్న పనిని మనము జ్ఞాపకం చేయవలసిన అవసరం లేదు.
- విషయచింతన అజ్ఞానమును పెంచుతుంది. ఆత్మచింతన ఆత్మజ్ఞానమును ప్రసాదిస్తుంది. విషయచింతన వలన రాగ, భయ, క్రోధములు కలుగుచున్నవి. విషయచింతన పరిణామంలో విషంగా మారుతుంది, మాయలో బంధిస్తుంది.
- ఆధ్యాత్మిక పురోగతికి ఆత్మవిశ్వాసం అవసరం. ఆత్మవిశ్వాసం ఉన్నవాడు పొగడ్తలకు పొంగిపోడు, విమర్శలకు కృంగిపోడు. ఆత్మవిశ్వాసం లేనివాడు జీవితంలో ఏదీ సాధించలేడు.
- కర్మఫలమును ఆశ్రయించకుండా కర్మను ఆచరిస్తే భక్తి కలుగుతుంది. భక్తి జ్ఞానసముపార్జనకు సహకరిస్తుంది. జ్ఞానమే అమృతానుభవం.

- ✍ సంసారమునకు కారణం అలవాట్లు. హృదయగుహలో ఉన్న బ్రహ్మమును నిరంతరము స్మరించుటవలన, ధ్యానించుట వలన అలవాట్ల వేగము నుండి విడుదల పొందవచ్చును.
- ✍ భక్తి అనే పులి సమీపమునకు దురలవాట్లు చేరవు.
- ✍ ప్రాణాయామం మనోనియమమునకు సహకరిస్తుంది. మనస్సును పరిశీలిస్తే అది అణుగుతుంది. అణిగిన మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగినవాడికి భౌతిక విషయముల పట్ల, ఆధ్యాత్మిక విషయముల పట్ల అవగాహన పెరుగుతుంది.
- ✍ దేహం మరణించుటకు ఒక రోగం చాలు. పునర్జన్మకు మానవ మానసంలో ఉన్న ఒక బలహీనత చాలు. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నవి. ఏ ఆకర్షణకు లోబడినా నైతిక విలువలకు దూరమవుతాడు.
- ✍ లోకం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. అది మనలో ఉన్న బలహీనతలను చూపించే ఒక అద్దంలాంటిది. కానీ మన బలహీనతలను తొలగించదు. మన బలహీనతలను మనం తొలగించుకొనుటకు చేస్తున్న ప్రయత్నమునే సాధన అని అంటారు. భగవదనుగ్రహం లేకుండా సాధకుడు సిద్ధుడు కాలేడు. సిద్ధముగా ఉన్న వస్తువును తెలుసుకొన్నవాడిని సిద్ధుడు అని పిలుస్తారు.
- ✍ కామక్రోధములకు దేహబుద్ధి కారణము. దేహబుద్ధి నశిస్తే అవి కాలిబూడిద అవుతాయి. సమాజములో ఉన్న అశాంతికి కామక్రోధముల యొక్క వేగము కారణము. మానవుడికి ప్రధాన శత్రువులుగా ఉన్న ఈ రెండింటి నుండి విడుదల పొందితేనేగాని బ్రాహ్మీస్థితి కలుగదు.
- ✍ సాధ్యమైనంత వరకు మన మనోదేహములను సక్రమంగా ఉపయోగించుకొని సామాజిక స్పృహ కలిగి ఉంటే పవిత్రులమవుతాము. పవిత్రుడు ఈశ్వరుని కృపకు పాత్రుడవుతాడు.
- ✍ నేర్పు, ఓర్పు, సహనం లేనివాడు భౌతిక విషయమునుగాని, ఆధ్యాత్మిక విషయమును గాని ఉన్నది ఉన్నట్లుగా గ్రహించలేడు.
- ✍ భగవంతుని పట్ల నిష్కామ భక్తి కలిగినవాడు లోకము యొక్క మోహము నుండి విడుదలపొందుతాడు.
- ✍ వివేకవంతులమై జీవించుటకు మనం అన్ని విధముల ప్రయత్నం చేయాలి. కాలం కలిసివచ్చినప్పడు ప్రయత్నం ఫలిస్తుంది.

- ఆత్మశాంతి ఎప్పటికప్పడు నిత్యనూతనంగా ఉంటుంది. అది బాహ్యమైన వస్తువులతోగానీ, సంఘటనలతోగానీ, వ్యక్తులతోగానీ సంబంధం లేకుండా స్వతంత్రముగా ఉంటుంది.
- మోక్షం మన హృదయంలోనే ఉంది. అది మన అనుభవంలోనికి రాకుండా అడ్డువచ్చే సంస్కారములను తొలగించుకోవాలి. దానినే సాధన అని అంటారు. మానవుడు పొందవలసినది, పొందదగినది మోక్షం మాత్రమే, మిగతా విషయములు అన్నీ స్వప్నతుల్యములు.
- గాఢనిద్ర నుండి జాగ్రదవస్థలోనికి వచ్చిన వెంటనే మొదట నేను అనే తలంపు వస్తుంది. అది ఉదయించగానే దానికి ఇతర తలంపులు వస్తాయి. ఆ ఇతర తలంపుల నుండి నేను అనే మొదటి తలంపును వేరుచేయాలి. ఎప్పడైతే వేరు చేసామో అది అంతర్ముఖం అవ్వటం ప్రారంభమవుతుంది. అంతర్ముఖమైన వాడికి ఆత్మదర్శనం అవుతుంది.
- నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావు లేదు. అది సుఖ స్వరూపము. బుద్ధిలోని దోషముల వలన, వికృతి గుణముల వలన అది అందటం లేదు. తెలిసినా, తెలియకపోయినా అన్ని కాలములలోను, అన్ని అవస్థలలోను అది హృదయంలో తనంతట తానుగా ప్రకాశిస్తూనే ఉన్నది. ఎక్కడైతే మనస్సు, మాట అణిగిందో అక్కడ అది వ్యక్తమవుతుంది.
- సాత్వికబుద్ధిని సంపాదించుకోవాలి. సత్వగుణము మోక్ష సుఖమునకు దారి చూపిస్తుంది. సత్వగుణం ఉన్నవాడు హెచ్చుతగ్గులు లేని జీవితమునకు అలవాటుపడతాడు. సత్వగుణమే నిజమైన సంపద, అదే వెలుగు.
- మనస్సు ద్వారాగానీ, వాక్కు ద్వారా గానీ, చేత ద్వారా గానీ ఇతరులను హింస పెట్టకూడదు. హింసా ప్రవృత్తిని త్యజించాలి. మనం ఇతరులకు ఏది చేస్తే అదే మనకు తిరిగివస్తుంది.
- సంసార కారణం బయట లేదు. లోపలే ఉన్నది. అది అజ్ఞాన రూపంలో ఉన్నది. దానిని తొలగించుకొన్నవాడు సంసారంలోనుండి విడుదల పొందుతాడు.
- భగవంతుడితో అనుబంధం కలిగించే దానిని భక్తి అని అంటారు. భక్తి వలన మనస్సు విశాలమవుతుంది. భక్తి ఎంత రహస్యంగా ఉంటే అంత మంచిది. భక్తికి ప్రచారముతో సంబంధం లేదు. భక్తిని జ్ఞానమాత అని అంటారు. భక్తి దురలవాట్ల నుండి విడుదల చేస్తుంది.

- సమాజపరంగా, సంసారపరంగా పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే వైరాగ్యం వస్తూ ఉంటుంది. కానీ అది తాత్కాలికం మాత్రమే. ఏది సత్యము ఏది అసత్యము, ఏది నిత్యము ఏది అనిత్యము అని విభజన చేసుకోవటం వలన నిజమైన వైరాగ్యం ఉదయిస్తుంది. వైరాగ్యం లేకుండా జ్ఞానోదయం కాదు.
- వైరాగ్యం ఉన్న వాడి మానసము ప్రపంచంలో ఏ విషయం మీద వాలదు, మనస్సు కదలదు. వైరాగ్యము కర్మ చక్రం నుండి తప్పిస్తుంది, స్వస్థత చేకూరుస్తుంది, ఏకాగ్రత కుదురుతుంది, పవిత్రతకు పునాదిగా ఉంటుంది.
- స్థూలబుద్ధి బాహ్యదృష్టిని పెంచుతుంది. సూక్ష్మబుద్ధి అంతర్‌దృష్టిని పెంచుతుంది, హృదయంలో సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్న సద్వస్తువును అనుభవైకవేద్యం చేస్తుంది. బుద్ధి సూక్ష్మత లేకుండా విచారణామార్గంలో అభివృద్ధిని సాధించలేము.
- మన తలంపు ద్వారా గానీ, మాటల ద్వారా గానీ, చేత ద్వారా గానీ అహంభావన అనే అగ్నిహోత్రంలో పడకుండా చూసుకోవాలి.
- చైతన్యమునకు మరొకపేరు హృదయము. హృదయమునుండే మనస్సు ఉదయించి మెదడులో విజృంభిస్తుంది. మనస్సు లేకపోతే దేహం లేదు. దేహం లేకపోతే ప్రపంచం లేదు. అందువలన ప్రపంచ చరిత్ర అంతా హృదయంలోనే ముగుస్తుంది.
- పునర్జన్మ హేతువులు ఎన్ని ఉన్నప్పటికీ నీవు దైవమునకు మినహాయింపులు లేకుండా శరణాగతి పొందితే అన్ని దోషములనుండి, బలహీనతల నుండి నిన్ను విడుదల చేసి మోక్షాన్ని ప్రసాదిస్తాడు.
- బుద్ధికి నిజం పట్ల పక్షపాతం ఉంది. అందువలన బుద్ధి నిజమును గ్రహించే వరకు దాని చాపల్యము నుండి విడుదల పొందలేదు.
- రూపముకంటే గుణము గొప్పది. గుణము కంటే జ్ఞానము గొప్పది. శక్తి రూపము మీద ఆధారపడి ఉండదు, గుణము మీద, జ్ఞానము మీద ఆధారపడి ఉంటుంది. జ్ఞానమే మోక్షము.
- మంచి మంచి కోసమే చేయాలి, చేసి మర్చిపోవాలి. మనస్సులో మోయకూడదు. ఫలకాంక్ష ఉండకూడదు. మంచితనము ఆత్మజ్ఞాన సముపార్జనకు ఎంతగానో సహకరిస్తుంది.
- మనం చేసేపని ఈశ్వరానుగ్రహమును సంపాదించి పెట్టాలి. అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. కానీ మనకు అర్హత, యోగ్యత, పవిత్రత లేకుండా దానిని పొందలేము.
- దైవచింతన వలన దైవము మీద ధ్యాస కలుగుతుంది. ధ్యాస వలన ధ్యానము

కుదురుతుంది. ధ్యానం వలన సమాధిస్థితి వస్తుంది. సమాధిస్థితి సాధించిన వాడిని దేహవాసన, లోకవాసన బాధించవు.

- ✍ స్వాధీనమైన ఇంద్రియములు, మనస్సు కలవాడికి ఉదయించే సుఖశాంతులతో పోల్చదగినవి ఈ లోకంలోగాని, పరలోకంలోగాని ఏమీ లేవు.
- ✍ భగవంతుడు అంటే ఉండటం. ఉండటం యొక్క స్వరూపం జ్ఞానము, ఆనందము. దేహం మరణించిన తరువాత కూడా మనం ఉంటామని మనకు తెలిస్తే, మరణ భయం ఉండదు. మనం మనంగా ఉండటం నేర్చుకొంటే దేహం ఉన్నా లేకపోయినా, లోకం కనిపించినా కనిపించక పోయినా శాశ్వత శాంతిలో ఉంటాము.
- ✍ బ్రహ్మం తప్పించి అన్నీ మనో కల్పితములే. నిరంతరము బ్రహ్మమును చింతించటం వలన, మనం చేసే కర్మయందు బ్రహ్మమును దర్శించటం వలన బ్రాహ్మీస్థితిని పొందవచ్చును.
- ✍ కామక్రోధములను రాగద్వేషములు అని కూడా అంటారు. ఇవి మన లోపల ఉన్న శత్రువులు. బాహ్యంగా ఉన్న శత్రువులకంటే ఇవి రెండూ మనలను ఎక్కువగా పీడిస్తాయి. వీటి వేగమును తట్టుకోగలిగినవాడే నిజమైన ధీరుడు.
- ✍ మార్పు అనేది లోపలినుంచి రావాలి. అప్పుడే నిజమైన ఆనందం పొందగలము. దైనందిన జీవితంలో మన ప్రవర్తన మీదే మన అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. పని ముఖ్యం కాదు, ఆ పని వెనుక మన ఉద్దేశం ముఖ్యం. దానిని బట్టే పని యొక్క ఫలితం నిర్ణయింపబడుతుంది.
- ✍ మనము త్యాగం చెయ్యవలసినవి మన ఇష్టాలు అయిష్టాలు. ఇవే మన బంధానికి కారణం. బంధంలోంచి భయం వస్తుంది. భయము వల్ల దుఃఖం వస్తుంది. నిజమైన ఆనందం ఇష్టాయిష్టాలు ఓవర్‌కమ్ చేసిన వాడికే కలుగుతుంది.
- ✍ జీవితంలో జరిగే ప్రతి సంఘటన, పుట్టుక మరణంతో సహా, అన్నీ ముందే నిర్ణయింపబడి ఉంటాయి. కానీ వాటిని ఎలా స్వీకరిస్తాము అనే విషయంలో మనకి ఫ్రీడమ్ ఉంటుంది. మన జీవితంలో ఏ సంఘటన జరిగినా ప్రశాంతంగా, సమత్వ దృష్టితో, పాజిటివ్‌గా తీసుకోవాలి. ఆ సంఘటన ద్వారా మనలో పవిత్రత పెంచుకోవటానికి, మనము ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి ఉపయోగించుకోవాలి.
- ✍ ప్రారబ్ధం అనేది మన పూర్వజన్మలలో చేసుకొన్న దాని ఫలితమే. మన తలంపు, మాట, చేత ఈ మూడింటి విషయంలో ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. మీ పనులు మీ మాటలే కాదు, మీకు వచ్చే ప్రతి తలంపుకి ఏదో ఒక జన్మలో సమాధానం

చెప్పవలసినదే.

- నా మాటలు వినుట వలన మీ కాలము వృధా అయిపోతున్నదని మీరు బాధపడకండి. మీ జీవితములో మధుర ఘడియలు అంటూ ఉంటే అది ఇక్కడ మీరు గడుపుతున్న కాలము మాత్రమే.
- ప్రియమైన ఆత్మబంధువుల్లారా! జ్ఞానములో మీరందరూ సర్వీచెట్లులాగా పైపైకి ఎదగాలని, సముద్రపు ఒడ్డున ఉన్న లైట్ హౌసుల్లాగా ఈ సమాజానికి మీరందరూ వెలుగును చూపాలని, గుడిలోనే శివుడిని చూస్తున్న మీరందరూ ప్రతీ జీవుడిలోనూ శివుడిని చూడాలని నేను హృదయపూర్వకముగా కోరుకుంటున్నాను.
- ఈ ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. అద్దం నీ ముఖంలో మచ్చలను ఎలా చూపిస్తుందో, అలాగే ఈ ప్రపంచం నీ మనస్సులో దోషాలని చూసుకోవటానికి అద్దంలా ఉపయోగపడుతుంది. అంతవరకే దాని ప్రయోజనం. ఆ దోషాల నుంచి బయటపడే ప్రయత్నం మనమే చేసుకోవాలి.
- నీలో దోషాలని పోగొట్టుకొని నువ్వు పవిత్రుడవు అవ్వటానికి చేసే ప్రయత్నమే నిజమైన విప్లవం. సమాజంలో వచ్చే గొడవలు పోరాటాలు విప్లవం కాదు. పవిత్రమైన హృదయం ఉన్నవాడు మాత్రమే సమాజానికి నిజమైన మేలు చెయ్యగలడు.
- మనము చేసే మంచి పనులు చెడ్డ పనుల వల్ల మన పునర్జన్మలు నిర్ణయింప బడతాయి. అయితే పుణ్యకర్మల వల్ల పుణ్యంతోపాటు మన మనస్సుని బాగుచేసుకొనే మార్గం తేలిక అవుతుంది. చెడ్డ కర్మలు మనని సన్మార్గం నుంచి తప్పించి పెడదారి పట్టిస్తాయి. అయితే ఆత్మజ్ఞానం పొందటానికి మంచిని చెడ్డని కూడా దాటి వెళ్ళిపోవాలి.
- మనస్సు విజృంభిచే స్థానము శిరస్సు. మనస్సు అణిగే స్థానము హృదయం. హృదయములో మనస్సును నిలబెట్టి ఉంచితే అది కరుగుతుంది, బేదబుద్ధి నశిస్తుంది, ఆనందము అనుభవంలోనికి వస్తుంది.
- మనకు తెలిసినా, తెలియకపోయినా ఈశ్వరుడు మన హృదయంలో ఉన్నాడు. మనస్సును అంతర్ముఖపరచి, బుద్ధిని శుద్ధిచేసి ప్రయత్నం చేస్తే మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు మనకు తానుగా వ్యక్తమవుతాడు. ఈశ్వర సాక్షాత్కారమే జీవితగమ్యము.
- సాధించవలసినది ఒక్కటే, తానెవరో తెలుసుకోవటమే. ప్రతి మనిషికి తప్పని సరిగా జీవిత గమ్యం ఉండాలి. దానిని బట్టి జీవించాలి. పవిత్రత అనే ద్వారం ద్వారా మాత్రమే మన జీవిత గమ్యాన్ని చేరుకోగలము.

# భక్తుల అనుభవాలు - Last Days

శ్రీ నాన్నగారు దేహయాత్ర చాలించే ముందు, చివరి మూడు నెలలలో ఆయనతో సన్నిహితంగా గడిపి ఆయన సేవలో తరించి, ఆయన దివ్య ప్రేమని అనుగ్రహాన్ని ప్రత్యక్షంగా అనుభవించిన భక్తులు వారి అనుభవాలు మనతో పంచుకొని ఆ అనుగ్రహంలో మనకి కూడా భాగం పంచుతున్నారు.

శ్రీ నాన్నగారు గత 3-4 సంవత్సరాలుగా అనారోగ్య సమస్యల వల్ల శారీరకముగా ఇబ్బందులకు గురి అవుతున్నారు. పుట్టినరోజు సెప్టెంబరు 23 నాటికే ఆయన దేహం నీరసించి అలసటగా ఉంది. అప్పటికే ఆయన సున్నితమైన చర్మంపై వచ్చిన దద్దుర్లవల్ల దురద, మంటలతో బాధపడుతున్నారు. అంత బాధలో కూడా ఒక భక్తుని ఇంటిలో పెళ్ళికి వస్తానని మాట ఇచ్చాననే నెపంతో చివరిసారిగా దేహంతో హైదరాబాదు భక్తులని అనుగ్రహించటానికి అక్కడికి ప్రయాణం చేసారు.

చర్మవ్యాధికి వైద్యం కోసం భీమవరంలో కొన్ని రోజులు ఉన్నారు. డాక్టరు వ్యాధి తీవ్రంగా ఉంది, విపరీతమైన బాధ ఉంటుంది అన్నారు. అంత బాధలోనూ భీమవరంలో ఉన్నన్ని రోజులూ భక్తుల కోసం సమయం వెచ్చించారు. భక్తులతో ఉన్నంతసేపూ నాన్నగారికి సమయమే తెలియదు! ఆ సమయంలో రామకృష్ణ పరమహంస గురించి ఎక్కువగా చెప్పేవారు. ఆ సమయంలో ఒక రాత్రి తన భక్తుడిని దగ్గరకు పిలిచి అన్నారు "ఇంక సరిపోతుంది, మాకూ సరిపడా వయస్సు ఉంది కదా, ఇంకా ఉన్నా కాంప్లికేషన్స్ ఉంటాయి". ఆ భక్తుడికి కొన్ని చెయ్యవలసిన పనులు, బాధ్యతలు అప్పగించారు.

అక్టోబర్ 13వ తేదీన విశాఖపట్టణములోని అపోలో హాస్పిటలులో ఆందోళనకరమైన ఆరోగ్య పరిస్థితిలో శ్రీ నాన్నగారికి వైద్యం ప్రారంభించారు. విశాఖపట్టణములోని భక్తుల అభ్యర్థనను మన్నించి హాస్పిటల్ సిబ్బంది ప్రత్యేకమైన వసతులు కల్పించి ప్రత్యేక శ్రద్ధతో గౌరవంగా చూసారు. 30-40 రోజుల వరకూ నాన్నగారు హాస్పిటల్‌లోనే ఉండవలసి వచ్చింది. రుగ్మతలు ఒకటి తరువాత ఒకటి వచ్చి ఆయన శరీరాన్ని బాధించాయి. తరువాత షర్మిలగారు అనే భక్తురాలి ఇంటిలో కొద్దిరోజులు ఉన్నారు. ఆ సమయంలో ఆయనంతట ఆయన లేచి కూర్చునే ఓపిక కూడా లేదు; అయినా పరిపూర్ణానందస్వామి చూడటానికి వచ్చారని విని శ్రమలేకుండా లేచి కూర్చుని ఆయనతో కొంతసేపు మాట్లాడారు. పరిపూర్ణానందస్వామి చేపట్టిన కార్యక్రమాలను మెచ్చుకొని శుభాకాంక్షలు తెలియజేసారు. కొద్దిరోజులకి జిన్నూరు తిరిగి వచ్చి చివరి రోజు వరకు తన ఇంటిలో, తన గదిలోనే ఉండి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

ఆయనతోపాటు ఆయన సేవ కోసం అక్కడ ఉన్న భక్తులకు అది ఒక తీక్షణమైన

ఆధ్యాత్మికానుభవము; అది అందుకోలేని వేగంతో సాగింది. రామకృష్ణపరమహంస పేరును RK RK అంటూ పదే పదే తలుస్తూ ఆయన రామకృష్ణుడే అయిపోయారు. ఆయన శారీరకబాధ ద్వారా కూడా అసామాన్యమైన ఆధ్యాత్మిక బోధ చేసారు. అది ఆయన జీవితం పొడుగునా సాగించిన కరుణాపూరితమైన బోధామృతం కంటే కూడా విలక్షణముగా సాగింది.

ఈ మూడు నెలల సమయంలో తెంపులేకుండా మానవాళి పట్ల, ప్రత్యేకంగా ఆయన భక్తుల పట్ల, ఆయన దయ కరుణా ప్రసరిస్తూనే ఉంది. శరీరం పట్ల శారీరక సుఖం పట్ల ఆయన శ్రద్ధ చూపలేదు. ఒకసారి అక్కడ ఆయనతో సన్నిహితంగా ఉన్న భక్తురాలితో అన్నారు "ఎందుకు నేను ఇంతగా బాధలు పడుతున్నాను? ఎవరికోసం?" ఆమెకి అర్థం అయ్యింది నాన్నగారు పడే బాధ ఆయనది కాదు, అది ఆయన భక్తులది. ఎంతోమంది వారికి జీవితంలో వచ్చే కష్టాలు బాధలు తట్టుకోలేక వాటినుంచి ఉపశమనం కలిగించమని నాన్నగారిని వేడుకొంటే వాటన్నిటినీ స్వీకరించి, ఎంతో కరుణతో దేహత్యాగం చేసేముందు ఆ బాధలన్నీ భరించారు. మధ్య మధ్యలో ఆ భక్తురాలితో ముందు జరగబోయే సంఘటనలు స్పష్టంగా చెప్పేవారు. ఆమెకీ ఆమెతో పాటు నాన్నగారి సేవలో ఉన్న ఇంకొక భక్తుడికీ "మీరు నా పని చెయ్యండి, నేను మీ పని చేస్తాను" అని చెప్పారు. ఆ తీవ్రమైన శారీరక బాధలను చూసి తట్టుకోలేక ఆ భక్తురాలు "నాన్నగారూ భగవంతుడు ఎంత కర్కోటకుడు" అని ఆక్రోసిస్తే, నాన్నగారు అన్నారు "శరీరం వస్తే దానితో పాటు సఫరింగ్ కూడా వస్తుంది, ఎక్కడైతే దేహం లేదో, ఎక్కడైతే మనస్సు లేదో, అక్కడ నేను ఉన్నాను".

ఆ భక్తురాలు తన భావాలను ఇంకా ఇలా పంచుకుంది. "నాన్నగారు నాకు సహనం, ఓపిక, క్షమాగుణాలు నేర్పించారు. నాకు దేహధ్యాస తగ్గించి నా ఏకాగ్రత ఆయనపైనే నిలిపేటట్టు చేసి, ఇతర విషయాలన్నీ మరచిపోయేలా చేసారు. నామీదే ఆధారపడి ఉన్నట్టు నటిస్తూ నేను ఆయనే లక్ష్యంగా చేసుకొనేటట్టు చేసారు. అందరికీ ఆధారంగా ఉన్న వారికి ఆధారాలు అవసరమా! దేహం విడిచేలోగా నేర్పించవలసినవన్నీ పూర్తి చెయ్యటానికే ఇదంతా! ఒకోసారి నా బుగ్గలని పట్టుకొని "ఎంత బాగా చూసుకొన్నావు అమ్మా నన్ను" అనేవారు. మరి ఆయన ఈ ప్రపంచంలో వేలకు వేల మందిని ఇంకెంత బాగా చూసుకున్నారో కదా! వాళ్ళ భౌతిక అవసరాలే కాదు వాళ్ళ మానసిక ఆధ్యాత్మిక అవసరాలు అభివృద్ధి కూడా చూసుకునేవారు. ఇతర ఆధ్యాత్మిక గురువుల వద్ద ఉన్నట్టుగా, నాన్నగారి దగ్గర ఎటువంటి హద్దులు నిబంధనలు ఉండవు. ఆయన భక్తులను ఎటువంటి క్రతువులు, ప్రయత్నాలు చెయ్యమని చెప్పలేదు. భక్తులకు సాధన పేరుతో ఎటువంటి ప్రయత్నము కష్టము లేకుండా ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించటమే ఆయన ధ్యేయం! అంతటి అద్భుతమైన అంతులేని ప్రేమ, మానవరూపంలో

మన మధ్యకి రావటం అనేది భక్తకోటికి ఎంతో దుర్లభంగా దొరికే ఒక అపూర్వమైన వరం. ఆయన బోధ జీవన స్రవంతిలా తరతరాలు సాగిపోతూ, అందరినీ దుఃఖం నుంచి సుఖానికి నడిపిస్తుంది. ఆయన దేహం ఇంకొక 5 రోజులలో విడుస్తారనగా శారీరక బాధ తీవ్రమై కనురెప్పలు కూడా కదపలేని స్థితిలో ఉన్నప్పుడు, ఒక్కసారి కళ్ళు తెరిచి "నువ్వు వెళ్ళిరా" అన్నారు. మిమ్మల్ని విడిచి వెళ్ళలేను అంటే "నేను 5 రోజులలో వెళ్ళిపోతాను" అన్నారు. అలాగే డిసెంబర్ 29వ తారీకున అతి పవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజున వెళ్ళిపోయారు. ఆయన నోటిలో తులసిరసం పోస్తూ ఒకచేతితో ఆయన చేతిని పట్టుకొని ఇంకొక చేతితో ఆయన గుండెల్ని నిమురుతూ ఉండగా శరీరాన్ని నిశ్శబ్దంగా విడిచారు - నాన్నగారు.

నాన్నగారి చివరి రోజులలో ఆయనతో అత్యంత సన్నిహితంగా మెలిగిన ఇంకొక భక్తుడు తన భావాలను ఇలా పంచుకున్నారు. "శ్రీ నాన్నగారు విశాఖపట్టణంలో ఆసుపత్రిలో ఉన్నారని తెలిసి వెళితే నాన్నగారు ఒప్పుకుంటారా లేదా అనే సంశయంలో ఉండగా అవసరమైన ఆయింటుమెంటు ఒకటి విశాఖపట్టణంలో దొరకలేదు పంపించమని కబురు వచ్చింది. వెంటనే సంతోషంగా కొన్ని డబ్బాలు పట్టుకొని వెళ్ళాను. నన్ను చూడగానే ఎన్ని తెచ్చావు అన్నారు. 50 అనగానే చిరునవ్వు నవ్వారు. ఆ సమయంలో నేను పూర్తి చెయ్యవలసిన కొన్ని వృత్తి బాధ్యతలు ఆశ్చర్యకరంగా శ్రీ నాన్నగారి అనుగ్రహంతో బాహ్యకారణాల వల్ల వాయిదా పడగా, నాకు ఆయనతో కలిసి ఉండే అవకాశం దొరికింది. ఒక రాత్రి డాక్టర్లు కండిషన్ చాలా క్రిటికల్‌గా ఉంది అన్నారు. మేము నాన్నగారితో ఆ విషయం చెప్పలేదు, కానీ కొద్దిసేపటికి కళ్ళు తెరిచి "కంగారు పడవద్దు, నేను వెళ్ళిపోవటం లేదు" అని మాతో చెప్పి, డాక్టర్లతో "మీరు ఇంటికి వెళ్ళి ప్రశాంతముగా నిద్రపోండి, రేపు సాయంత్రానికి అన్నీ చక్కబడతాయి" అన్నారు. మర్నాడు సాయంత్రం ఒక చర్మవ్యాధి నిపుణుడు ఇచ్చిన మందుతో మంత్రం వేసినట్టుగా చర్మబాధ తగ్గింది. మర్నాడు మెడికల్ రిపోర్టులు కూడా మామూలుగా వచ్చేసాయి. ఆయన పడే శ్రమ తీవ్రమైన బాధ చూడలేక ఒకరోజు బయటికి వచ్చి భగవాన్ పటం ముందు ఏడ్చాను "ఇన్ని సంవత్సరాలు ఆయనను ఉపయోగించుకొని ఇప్పుడు ఈ బాధలు పెట్టావు, నువ్వు కర్కశుడివి. దయచేసి ఆయనను ఈ శరీరం నుంచి విడుదల చేసి ఆయనకి ఉపశమనం కలిగించు" అని ప్రార్థించాను. ఆయన శరీరం నుంచి విడుదల పొందాలని కోరుకుంటూ కొద్దిసేపు గడిపాను. శ్రీ నాన్నగారు కళ్ళు తెరిచి "నేనెప్పుడు చనిపోతాను అని అలా అనుకోకూడదు" అన్నారు. అప్పుడు నా తప్పు నాకు తెలిసింది, శ్రీ రమణమహర్షులకు నాన్నగారికి భేదం లేదు అని అర్థం అయ్యింది. విశాఖపట్టణం నుంచి జిన్నూరు తిరిగి వచ్చాక కొద్దిరోజులు గాలి వెలుతురు గురించి మొదటి

అంతస్తులో తన కుమారుని ఇంటిలో ఉన్నారు. ఆ సమయంలో వేల్పూరు ఆశ్రమం నుంచి కొందరు భక్తులు, శ్రీ రమణమహర్షుల శిష్యులైన శ్రీ పళని స్వామి గురించి ముద్రించిన పుస్తకం తెచ్చారు. పుస్తకం అట్టపైన రమణులు పళనిస్వామి కలిసి ఉన్న బొమ్మని చూసి చిరునవ్వుతో ప్రేమగా హృదయానికి హత్తుకున్నారు. పళనిస్వామే శ్రీ నాన్నగారుగా మళ్ళీ జన్మించారని వేల్పూరుస్వామి చెప్పారని విన్నాను. నాన్నగారు కూడా ప్రసంగాలలో తనకు పూర్వజన్మలో విరూపాక్ష గుహవద్ద భగవాన్‌తో అనుబంధం ఉందని చెప్పారు. వేల్పూరుస్వామి చెప్పింది నాన్నగారు ఒప్పకున్నట్టు అనిపించింది. ఒకరోజు నాన్నగారు నన్ను పిలిచి నాలుగు వేళ్ళు చూపించి తన గదిలోనే ఉండిపోమన్నారు. అప్పటివరకు ఆయనకు ఎదురుగా ఉన్న గదిలో రాత్రిపూట పడుకొనే వాడిని. ఆ రోజు నుంచి రాత్రి పగలు ఆయన పక్క నుంచి కదలలేదు. అయిదవ రోజున I love you అన్నారు. తరువాత ఏమైందో తెలియదు నాలో ఉన్న శక్తి అంతా హరించిపోయింది. నేను ఇదివరకటిలా ఆయన పనులు ఏమీ చెయ్యలేకపోయాను. బయటికి వెళ్ళాలి అనుకొంటే నన్ను పిలిచేవారు. భీమవరంలో మా ఇంటికి కొద్దిరోజులు ఉందామని వెళ్ళి ఉండలేక తిరిగి వచ్చేసి, చివరి పదిరోజులు కదలకుండా నాన్నగారి పక్కనే ఉండిపోయాను. నాలా ఆయనతోపాటే ఉన్న భక్తురాలు నాన్నగారు 5 రోజులలో శరీరం వదిలేస్తానని చెప్పారని అన్నారు. ఆ సమయంలో నేను అక్కడ లేను. 5 రోజుల తరువాత తిథి వైకుంఠ ఏకాదశి అని కూడా ఆవిడ చెప్పారు. వెంటనే మనస్సులో అనుకొన్నాను **అదే ఆయన సంకల్పం అయితే అలాగే జరగనీ!** చివరి రోజు మధ్యాహ్నం వరకూ భక్తులు ఆయన దర్శనానికి వస్తూనే వున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్రీ నాన్నగారు శరీరాన్ని విడిచిపెట్టారు. ఆ సమయంలో అంతకు ముందు ఆయన ముఖములో ఉన్న బాధ మాయమై కాంతివంతంగా మారింది. భక్తులు మరియు కుటుంబసభ్యులు గౌరవంతో ఆయన దివ్యమైన భౌతిక దేహం అదే రోజున మహా సమాధి చేసారు".

నాన్నగారు నిశ్శబ్ధంగా వెళ్ళిపోయారు. మానవాళికి అత్యంత ప్రియమైన, వెలకట్టలేని వరప్రసాదమైన నాన్నగారు పరిపూర్ణమైన మౌనములో, వెళ్ళిపోతున్నారనే జాడకూడా తెలియకుండా వెళ్ళిపోయారు - నిజానికి మనము విడిపోవటం లేదు అని బహుశా మనకి తెలియచెప్పటానికేమో! ఊపిరి ఉన్నంతవరకే కాదు, ఆ దేహం లేకపోయినా ఆయనతో అనుబంధం కొనసాగుతూనే ఉంటుంది.

We love you nannagaru from the bottom of our hearts!

**Silent and Powerful teaching of Sri Nannagaru**

శ్రీ నాన్నగారు చివరి శ్వాస వరకు మాటకి భాషకి అందినంతవరకు మనకి జ్ఞానాన్ని

బోధించి అనుగ్రహించారు. ఆయన బోధల ద్వారా జ్ఞాని యొక్క మాటలకి ఉన్న శక్తిని తెలియజేస్తూ ఆ మాటలని షేర్ చేసుకోవటం వలన మనకి వచ్చే ఆనందాన్ని కూడా రుచి చూపిస్తున్నారు. నాన్నగారికి ప్రతి భక్తుడి తోటి పర్సనల్ టచ్ ఉండేది. అందువల్ల ఎవరికి ఏది అవసరమో దానిని అనుగ్రహించేవారు. ప్రతి విషయములోను మన స్థాయికి దిగి మనకి అందేటట్లు చేసేవారు. ఇప్పుడు మనం ఉన్న పరిస్థితిలో సైలెంట్ అండ్ పవర్‌ఫుల్ గ్రేస్ అందచేస్తున్నారు. ఆయన భౌతికంగా చూపించిన గ్రేస్ కన్నా ఉన్నతమైన స్థితికి, అంటే మనల్ని మన లోపలికి ఇన్నర్ సైడ్‌గా లాగుతున్నారు.

నాన్నగారి దేహం అనుభవించిన బాధలు ఆయనవి కావు. భక్తులు వాళ్ళ బాధలు భరించలేక, అనుభవించే శక్తి లేక, శరణాగతి చెంది ఆయనని వేడుకోవటం వల్ల అవి అన్నీ ఆయన స్వీకరించి ఆయన దేహంతో అనుభవించటం భక్తులని అనుగ్రహించటమే. ఈ సంఘటన ద్వారా జ్ఞాని యొక్క దయ అంతులేనిదని మనకి ప్రత్యక్షంగా చూపించారు. నాన్నగారు భరించిన బాధలు మానవమాత్రులుగా మనము భరించగలిగేవి కాదు, అనే ఆలోచన అందరి భక్తులలోను ఉదయించింది. అందుకని భక్తుల దుఃఖానికి అంతులేదు. నాన్నగారి దేహం మీద ఉన్న అటాచ్‌మెంట్ వల్ల (అంటే ఒక జ్ఞాని దేహం మీద ఉన్న ఆటాచ్‌మెంట్) ఆ దేహం లేనప్పడు భక్తులు అందరిలోనూ ఒక నిరాశాభావాన్ని కలిగిస్తోంది - అదే వైరాగ్యం. ఆయన దేహం ద్వారా జరుగవలసిన జ్ఞానబోధని పరిపూర్ణం చేసి ఇప్పడు దేహత్యాగం తరువాత మనలో వైరాగ్యాన్ని కలుగజేసి ఏ జ్ఞానాన్ని అయితే బోధించారో దానిని మనలో సుస్థిరం చేస్తున్నారు.

ఈ సమయంలో మనము సహనంతో వివేకంతో ఉండాలి. "భగవాన్ శరీరంతో ఉన్నా లేకపోయినా నాకేమీ బేధం లేదు" అన్నారు నాన్నగారు. "దేహం ఉన్నా లేకపోయినా, భక్తులతో నా అనుబంధం కంటిన్యూ అవుతుంది" అని ఆయనే స్వయంగా చెప్పారు. ఇప్పడు మనం ఉన్న పరిస్థితులలో నాన్నగారికి భగవాన్‌తో ఉన్న అనుబంధం లాంటిది, మనకీ నాన్నగారికి మధ్య కూడా ఉండాలి అని మనందరికీ తెలియజేస్తున్నారు. భక్తుల పట్ల ఆయనకున్న ప్రేమను ఈవిధంగా వ్యక్తం చేసారు - "నా శరీరం మరణించినా, నేను వారి హృదయాలలో జీవించే ఉంటాను" అన్నారు.

"చెప్పటము కాదు ఇవ్వటమే. ఏ ఒక్కరికి ఇవ్వకపోయినా బాధపడతారు కదా, అందుకని అందరికీ ఇచ్చేద్దాం" అని నాన్నగారు ఎప్పడూ అనేవారు. ఆయన దయ అటువంటిది. ఆయన దయకి పాత్రులము అయినందుకు మనందరమూ మన హృదయాలని ఆయనకి అర్పిద్దాము.

## జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

**ఫిబ్రవరి 13న మహాశివరాత్రి సందర్భంగా అమలాపురం మాష్టారు చావలి సూర్యనారాయణమూర్తి గారిచే మధ్యాహ్నం 2 గంటలకు ప్రవచనము**

## ముందుమాట

మన ప్రియతమ తండ్రి, ఆరాధ్య దైవము, ఆత్మస్వరూపులు అయిన సద్గురు శ్రీ నాన్నగారు తన 84వ సంవత్సరములో డిసెంబరు 29, 2017 తేదీన మధ్యాహ్నం 12 గంటలకు, పర్వదినమైన వైకుంఠఏకాదశి రోజున మహానిర్వాణము పొందినారు.

శ్రీ నాన్నగారు తమ చిన్న వయస్సులోనే భగవాన్ శ్రీ రమణమహర్షి అనుగ్రహానికి పాత్రులై రమణ తత్త్వాన్ని దేశవిదేశములలో ప్రచారం చేయుటకు తన జీవితాన్ని అంకితం చేసారు. పండిత పామరులకే కాకుండా సాధారణ గృహిణులకు కూడా అర్థం అయ్యే తేలిక భాషలో రమణతత్త్వాన్ని బోధించి వారిని చైతన్యవంతుల్ని చేసారు.

ఆయన బోధలు శ్రవణం చేసి ఆయన సమక్షంలో గడిపిన అనేక వేలమంది భక్తులు సాధన పేరుతో కష్టం లేకుండా అతి తేలికగా ఆధ్యాత్మిక అభివృద్ధి పొందారు. రమణుని బోధనలే కాకుండా భగవద్గీతాసారాన్ని, ఆదిశంకరుల అద్వైతబోధని, ఇంకా బుద్ధుడు, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, ఏసుక్రీస్తు, మొహమ్మద్ ప్రవక్త వంటి మహాత్ముల బోధలు, పాశ్చాత్య తత్త్వవేత్తల హృదయాలను విప్పి, పండితులకు పామరులకే కాకుండా తమ వద్దకు వచ్చే వివిధరకాల భక్తులకు ఉపయోగపడే విధంగా బోధించారు. శ్రీ నాన్నగారు గృహస్థులైనప్పటికీ నిరాడంబరముగా, నిర్మలంగా, అతి సాధారణంగా ఆయన జీవించిన జీవితవిధానమే మనకు మార్గదర్శకం. మన అందరి పట్ల శ్రీ నాన్నగారు చూపిన ప్రేమ, ఆదరణలకి మనం జీవితాంతం కృతజ్ఞులమై ఆయన చూపించిన మార్గాన్ని అనుసరించి జీవించాలి.



# ఆత్మ నీరాజనము

బుద్ధదేవుని భూతదయను పునరుద్ధరింపంగ
పుడమి పై వెలసె శ్రీనాన్న దేహంబునన్
కలిగె రాజాయమ్మ నోముల పంటగా కన్నమాణిక్యముగా
పరమపుణ్యంబు పండంగ వారలు
పరుగు పరుగున వచ్చు ఆ పరమాత్మ
శ్రీనాన్న చరణంబుల చెంతకున్
నీచ గుణంబు లెల్ల నిర్మూలమైపోవు వారి సుజనగోష్ఠి వల్ల
లోచూపు నేర్పును లోకకళ్యాణమునకున్
పరగతిని చూపును పరిపరి విధముల కాపుకాచుచున్
అనవరతమును భక్తులను పయనింపచేయున్
పరమపదమునకు పుష్పకవిమానముపైనన్
అరుదైన భూతదయానిధి నిర్మలుడై ఆత్మనియత
కలవాడు ధర్మతత్పర బుద్ధి కలిగినవాడు
సృష్టిపై హితముగ సంచరించువాడు
పగలూ, ప్రతీకారాలూ లేక మదిలో మసలినవారు పావనమూర్తి
పరమాత్మ శ్రీనాన్న సద్గురుదేవునకు
తండ్రీ, తండ్రీ, తండ్రీ ఇదియే నా హార్ధిక
పూజా సుమ మాల, ఇదియే నా ఆత్మనీరాజనములు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**